www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల రూ.5.00
Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 08 | శుక్రవారం | 7 ఆగస్టు, 2026

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 9014966169

# సామాజిక న్యాయమే లక్ష్యం

## ఇందుకోసం నా జీవితాన్నే అంకితం చేస్తున్నా




- అట్టడుగు, అణగారిన వర్గాల్లో సాధికారిత వచ్చే వరకూ నా పోరాటం ఆగదు
- నేను బీసీల కోసం మాట్లాడితే అగ్రకులం అంటూ హేళన చేస్తారు
- నా పుట్టుక నా చేతిలో లేదు.. నేను ఎవరి కోసం పనిచేయాలో నిర్ణయించుకోవడం మాత్రం నా చేతుల్లోనే ఉంది
- బీసీ బిల్లును వచ్చే బడ్జెట్ సెషన్ లోపు పాస్ చేసి పంపించాలి.. లేదంటే వెయ్యి కార్లతో చలో ఢిల్లీ నిర్వహిస్తాం
- సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

సామాజిక న్యాయ తెలంగాణ సాధనే నా జీవిత లక్ష్యం. అందుకోసం జీవితాన్నే అంకితం చేస్తున్నా. సమాజంలోని అట్టడుగు, అణగారిన వర్గాలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక సాధికారత కల్పించే వరకు నా పోరాటం ఆగదు. అన్నివర్గాలకు న్యాయం జరిగేలా పోరాడాలంటే ధైర్యం, నిబద్ధత అవసరం. ఆ సంకల్పంతోనే ముందుకు సాగుతున్నా. నేను బీసీల హక్కుల కోసం మాట్లాడితే అగ్రకులంలో పుట్టిన వ్యక్తిగా కొందరు ప్రశ్నిస్తారు. నా పుట్టుక నా చేతిలో లేకపోయినా, ఎవరి కోసం పనిచేయాలో నిర్ణయించుకునే హక్కు మాత్రం నాకుంది. దేశంలో సామాజిక మార్పులు తీసుకొచ్చిన అనేకమంది సంస్కర్తలు అగ్రవర్ణాల్లో పుట్టినా అట్టడుగు వర్గాల అభ్యున్నతికే కృషి చేశారు.

– కల్వకుంట్ల కవిత, టీఆర్ఎస్ చీఫ్

**ప్రజానావ, హైదరాబాద్:** సామాజిక న్యాయ తెలంగాణ సాధనే తన జీవిత లక్ష్యమని, అందుకోసం తన జీవితాన్నే అంకితం చేస్తున్నానని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. సమాజంలోని అట్టడుగు, అణగారిన వర్గాలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక సాధికారత కల్పించే వరకు తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు. తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో గురువారం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలో ఆమె ప్రసంగించారు. సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా పోరాడాలంటే ధైర్యం, నిబద్ధత అవసరమని, ఆ సంకల్పంతోనే ముందుకు సాగుతున్నానని కవిత పేర్కొన్నారు. తాను బీసీల హక్కుల కోసం మాట్లాడితే అగ్రకులంలో పుట్టిన వ్యక్తిగా తనను కొందరు ప్రశ్నిస్తారని అన్నారు. అయితే తన పుట్టుక తన చేతిలో లేకపోయినా, ఎవరి కోసం పనిచేయాలో నిర్ణయించుకునే హక్కు మాత్రం తనకుందని స్పష్టం చేశారు. దేశంలో సామాజిక మార్పులు తీసుకొచ్చిన అనేక మంది సంస్కర్తలు అగ్రవర్ణాల్లో పుట్టినా అట్టడుగు వర్గాల అభ్యున్నతికే కృషి చేశారని గుర్తుచేశారు. గౌతమ బుద్ధుడు, ఛత్రపతి సాహూ మహారాజ్, మాజీ ప్రధాని వి.పి.సింగ్, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత వంటి నాయకులు సామాజిక న్యాయం కోసం తీసుకున్న నిర్ణయాలను ఉదాహరణగా ప్రస్తావించారు.

### సార్ కలలు సాకారం చేస్తా

ప్రొఫెసర్ జయశంకర్ కలలు కన్న సామాజిక తెలంగాణను సాకారం చేయడమే తన సంకల్పమని కవిత తెలిపారు. భౌగోళిక తెలంగాణ సాధించిన తర్వాత సామాజిక తెలంగాణ సాధన కోసం ఉద్యమం కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారని, ఆ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు తరువాయి 2లో..

# కొత్త రేషన్ కార్డులు

- 15న సంగారెడ్డిలో అందజేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 119 నియోజకవర్గాల్లో పంపిణీ
- లబ్ధిదారులకు కోటి 5 లక్షల ల్యామినేటెడ్ స్మార్ట్ రేషన్ కార్డుల అందించనున్న ప్రభుత్వం



**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డు లబ్ధిదారులకు శుభవార్త తెలిపింది. రాష్ట్రంలో కొత్త ల్యామినేటెడ్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ఆగస్టు 15 నుంచి ప్రారంభించనున్నట్లు నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి అన్ని 119 అసెంబ్లీ నియోజక వర్గాల్లో రేషన్ కార్డుల పంపిణీ చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. మొత్తం కోటి 5 లక్షల ల్యామినేటెడ్ స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులైన లబ్ధిదారులకు అందజేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. పేద కుటుంబాల ఆహార భద్రతను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమ పాలనలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ మరో కీలక మైలురాయిగా నిలవనుందని ఆయన అన్నారు.

### మరింత పారదర్శకంగా రేషన్ వ్యవస్థ

రాష్ట్రంలో ఇప్పటికే అనేక మందికి రేషన్ కార్డులు ఆన్‌లైన్‌లో కేటాయించినప్పటికీ, భౌతిక కార్డులు అందని పరిస్థితి ఉందన్నారు. ఆన్‌లైన్ ఆధారంగానే చాలామంది రేషన్ పొందుతున్నప్పటికీ, ఇకపై అందరికీ ల్యామినేటెడ్ స్మార్ట్ రేషన్ కార్డులను అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం నుంచి ప్రారంభమయ్యే ఈ పంపిణీ కార్యక్రమంతో రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులందరికీ భౌతిక స్మార్ట్ రేషన్ కార్డులు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ప్రజలకు రేషన్ పంపిణీ వ్యవస్థ మరింత పారదర్శకంగా, సులభతరంగా మారుతుందని అధికారులు భావిస్తున్నారు.



# సింగరేణికి నైనీ బొగ్గు

## ఒడిశా గని నుంచి తొలిసారిగా తెలంగాణకు చేరిన 4వేల టన్నుల బొగ్గు

- జైపూర్ థర్మల్ విద్యుత్ కేంద్రానికి చేరుకున్న మొదటి రైలు
- ఘన స్వాగతం పలికిన అధికారులు
- 136 ఏళ్ల సింగరేణి చరిత్రలో చారిత్రక ఘట్టమిది
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ప్రజానావ, మంచిర్యాల:** 136 ఏళ్ల సింగరేణి చరిత్రలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ఒడిశాలోని నైనీ బొగ్గు గని నుంచి ఉత్పత్తి చేసిన తొలి బొగ్గు రైలు గురువారం మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు చేరుకుంది. రాష్ట్రం వెలుపల ఉన్న సింగరేణి గని నుంచి బొగ్గును తవ్వి, సొంత థర్మల్ విద్యుత్ కేంద్రానికి తరలించడం ఇదే తొలిసారి కావడం విశేషం. 59 రైల్వే వ్యాగన్లలో సుమారు 4 వేల టన్నుల అత్యుత్తమ నాణ్యత కలిగిన జీ–10 గ్రేడ్ బొగ్గు జైపూర్‌కు చేరుకోగా, సింగరేణి అధికారులు, ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యం, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు.

### చారిత్రక విజయమిది: భట్టి

నైనీ గని నుంచి తొలి బొగ్గు తెలంగాణకు చేరుకోవడం సింగరేణి చరిత్రలో చిరస్మరణీయ ఘట్టమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్టుకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. దేశ ఇంధన అవసరాల తీర్చడంలో సింగరేణి బొగ్గు కీలక పాత్ర పోషిస్తోందని, భవిష్యత్తులో మరిన్ని బొగ్గు బ్లాకుల సాధనకు కృషి కొనసాగుతుందని చెప్పారు.

### అడ్డంకులు అధిగమించి..

ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్‌కు సంబంధించిన అనుమతుల సాధనలో ఎదురైన అనేక సవాళ్లను అధిగమించి ఈ విజయాన్ని సాధించామని ప్రభుత్వం తెలిపింది. ఈ ప్రక్రియలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రెండుసార్లు ఒడిశా పర్యటించి అక్కడి ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో తరువాయి 2లో..



# రోడ్ నెట్‌వర్క్‌కు ఏకీకృత వ్యవస్థ

2

- ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లన్నీ ఒకే వ్యవస్థ పరిధిలోకి తేవాలి
- రేడియల్ రోడ్డు–1ను డిసెంబర్ 9 నాటికి పూర్తిచేయాలని అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

## మోదీ విదేశీ పర్యటనలకు రూ.483 కోట్లు

- ఐదేళ్లలో మోదీ అధికారిక పర్యటనల ఖర్చు వివరాలు వెల్లడించిన కేంద్రం
- పర్యటనల ఫలితంగా రూ.31.69 లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులు
- 2025లో 23 దేశాల పర్యటనలకు రూ.187 కోట్లు
- ఈ ఏడాది ఇప్పటివరకు రూ.74.58 కోట్లు ఖర్చు

2

## క్యా బోల్తీ పబ్లిక్‌తో ప్రజల్లోకి..

- దేశవ్యాప్తంగా కొత్త ప్రజా ప్రచార కార్యక్రమానికి సీజేపీ శ్రీకారం
- నిరుద్యోగం, విద్య, సామాజిక న్యాయంపై ప్రజాభిప్రాయాల సేకరణే లక్ష్యం
- రాజకీయ పార్టీగా కాదు.. ప్రజల తరపున ఒత్తిడి తెచ్చే వేదికగానే కొనసాగుతామని స్పష్టం

2



## పెన్, పేపర్ విధానానికి చెల్లు

- జేఈఈ తరహా నీట్
- కంప్యూటర్ ఆధారిత పరీక్షకు కేంద్రం కసరత్తు
- నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్ టాస్క్‌ఫోర్స్ సిఫార్సుల మేరకు తుది నిర్ణయం
- సుప్రీంలో అఫిడవిట్ దాఖలు చేసిన కేంద్రం
- 19కి విచారణ వాయిదా

2

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు!



- పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్ట సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- అవసరమైతే యూపీఐ, ఇతర డిజిటల్ చెల్లింపులపై కేంద్రానికి ఎండీఆర్ విధించే అధికారం

2



## తెలంగాణ గొంతు బలహీనపడొద్దు

2

- కేసీఆర్ వంటి నాయకత్వమే తెలంగాణ ప్రయోజనాలను కాపాడుతుంది
- ఢిల్లీపై ఆధారపడే రాజకీయాలతో రాష్ట్రానికి నష్టం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలంటే బలమైన ప్రాంతీయ నాయకత్వం అవసరమని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వంటి నాయకత్వమే రాష్ట్ర హక్కులను సమర్థంగా కాపాడగలదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఢిల్లీపై ఆధారపడే రాజకీయాల వల్ల తెలంగాణ స్వరం బలహీనపడుతుందని, రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కె. జయశంకర్ జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

# హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ క్లౌడ్

న్యూఢిల్లీ: ప్రపంచ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ భారతదేశంలో తన నాలుగో క్లౌడ్ రీజియన్‌ను హైదరాబాద్‌లో అధికారికంగా ప్రారంభించింది. ఇండియా సౌత్ సెంట్రల్ పేరుతో అందుబాటులోకి వచ్చిన ఈ కొత్త క్లౌడ్ రీజియన్ ద్వారా సంస్థలు, వినియోగదారులు తమకు అవసరమైన మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సేవలు, వర్క్‌లోడ్‌లను హైదరాబాద్ నుంచే నిర్వహించుకునే అవకాశం కల్పించింది. హైదరాబాద్ కేంద్రంతో పాటు ఇప్పటికే పుణె (సెంట్రల్ ఇండియా), చెన్నై (సౌత్ ఇండియా), ముంబై (వెస్ట్ ఇండియా)లో క్లౌడ్ రీజియన్‌లను నిర్వహిస్తున్న మైక్రోసాఫ్ట్.. ఇప్పుడు దేశంలోనే అత్యధిక హైపర్‌స్కేల్ క్లౌడ్ మౌలిక వసతులు కలిగిన సంస్థగా నిలిచింది. ఈ క్లౌడ్ రీజియన్ ప్రారంభం భారత్‌లో డిజిటల్, కృత్రిమ మేధ (ఏఐ) మౌలిక వసతుల అభివృద్ధికి మైక్రోసాఫ్ట్ ప్రకటించిన 20.5 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళికలో భాగం. ఇందులో 2025 జనవరిలో ప్రకటించిన 3 బిలియన్ డాలర్ల పెట్టుబడితో పాటు, అదే ఏడాది డిసెంబరులో ప్రకటించిన మరో 17.5 బిలియన్ డాలర్ల పెట్టుబడి కూడా ఉంది. హైదరాబాద్ క్లౌడ్ రీజియన్‌లో మూడు అవైలబిలిటీ జోన్లు ఏర్పాటు చేశారు. కీలక డేటా, వ్యాపార కార్యకలాపాలకు అంతరాయం లేకుండా పనిచేసేలా దీనిని రూపొందించారు. నీటి వినియోగాన్ని తగ్గించే జీరో–వాటర్ కూలింగ్ టెక్నాలజీతో ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేయడం విశేషం. 2030 నాటికి వాటర్ పాజిటివ్ లక్ష్యాన్ని సాధించే దిశగా మైక్రోసాఫ్ట్ చర్యలు చేపడుతోంది. ఈ కొత్త క్లౌడ్ రీజియన్ సేవలకు ఇప్పటికే అదానీ గ్రూప్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, పీబీ పే వంటి ప్రముఖ భారతీయ సంస్థల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ వెల్లడించింది.

### వేగంగా పెరుగుతున్న మార్కెట్

పరిశోధనా సంస్థ ఐడీసీ అంచనాల ప్రకారం, భారత్‌లో పబ్లిక్ క్లౌడ్ సేవలపై వ్యయం 2030 నాటికి 45.7 బిలియన్ డాలర్లకు చేరనుంది. ఈ రంగం ఏటా 22.2 శాతం వృద్ధి నమోదు చేయనుండగా, కృత్రిమ మేధ (ఏఐ) సేవలపై పెట్టుబడులు అంతకంటే వేగంగా పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.

# క్యా బోల్తీ పబ్లిక్‌తో ప్రజల్లోకి..

- దేశవ్యాప్తంగా కొత్త ప్రజా ప్రచార కార్యక్రమానికి సీజేపీ శ్రీకారం
- నిరుద్యోగం, విద్య, సామాజిక న్యాయంపై ప్రజాభిప్రాయాల సేకరణే లక్ష్యం
- రాజకీయ పార్టీగా కాదు.. ప్రజల తరఫున ఒత్తిడి తెచ్చే వేదికగానే కొనసాగుతామని స్పష్టం

ముంబై: విద్యార్థి ఉద్యమాల ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రజల్లోకి వెళ్లేందుకు కొత్త కార్యాచరణను ప్రకటిం చింది. క్యా బోల్తీ పబ్లిక్ పేరుతో దేశవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. ప్రజల సమస్యలు, అభిప్రాయాలు, ఆకాంక్షలను నేరుగా తెలుసుకోవడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. మహారాష్ట్రలో జరిగిన పార్టీ ప్రధాన బృంద సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన దీప్కే.. సెప్టెంబర్ నుంచి దేశవ్యాప్తంగా పర్యటిస్తూ విద్యార్థులు, యువత, సాధారణ ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవుతామని చెప్పారు. నిరుద్యో గం, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం, ప్రభుత్వ వ్యవస్థల పై ప్రజల్లో తగ్గుతున్న విశ్వాసం వంటి అంశాలపై దేశవ్యాప్తంగా చర్చ ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచన తమకు లేదని, రాజకీయ పార్టీగా కాకుండా ప్రజల తరఫున ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రెషర్ గ్రూప్‌గానే సీజేపీ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజల గొంతుకగా పనిచేయడమే తమ లక్ష్యమని చెప్పారు.

### అత్యంత కీలక సమస్యగా నిరుద్యోగం

దేశంలో నిరుద్యోగం అత్యంత కీలక సమస్యగా మారిందని, అదే సమయంలో నాణ్యమైన విద్య సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు అందనంత భారంగా మారుతోందని దీప్కే ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజులు లక్షల రూపాయలకు చేరుకోవడంతో కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయని పేర్కొన్నారు. విద్య వ్యాపారంగా కాకుండా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే ప్రాథమిక హక్కుగా ఉండాలని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలు జవాబుదారీతనాన్ని కోల్పోతున్నాయని, ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం దెబ్బతింటోందని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించేలా సంస్కరణలు అవసరమని అభిప్రాయపడ్డారు.

### క్యూ ఆర్ కోడ్‌తో సభ్యత్వం

క్యా బోల్తీ పబ్లిక్ ప్రచారంలో భాగంగా ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి, వాటిని ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలిచిన వారు అధికారిక క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఉచితంగా సభ్యత్వం పొందవచ్చని, మోసపూరిత చెల్లింపు అభ్యర్థనల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వాల ముందుకు తీసుకెళ్లే బాధ్యతాయుతమైన ప్రజా వేదికగా సీజేపీ పనిచేస్తుందని, ప్రజాస్వామ్య వ్యవస్థలను మరింత జవాబుదారీగా మార్చడమే తమ ఉద్యమం లక్ష్యమని అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు.

# పెన్, పేపర్ విధానానికి చెల్లు

- జేఈఈ తరహా నీట్
- కంప్యూటర్ ఆధారిత పరీక్షకు కేంద్రం కసరత్తు
- నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్ టాస్క్‌ఫోర్స్ సిఫార్సుల మేరకు తుది నిర్ణయం
- సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన కేంద్రం
- ఈ నెల 19కి విచారణ వాయిదా

న్యూఢిల్లీ: నీట్ యూజీ పరీక్ష నిర్వహణ విధానంలో కీలక మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం అమల్లో ఉన్న పెన్–పేపర్ విధానానికి స్వస్తి పలికి, జేఈఈ తరహాలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు సుప్రీం కోర్టులో కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసింది. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో ఏర్పాటు చేసిన హైపవర్ టాస్క్‌ఫోర్స్ సిఫార్సుల ఆధారంగా నీట్ యూజీ నిర్వహణలో మార్పులపై తుది నిర్ణయం తీసుకుంటామని కేంద్రం తెలిపింది. పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్‌లు, వ్యవస్థాగత లోపాలను నివారించేందుకు సమగ్ర సంస్కరణలు చేపడుతున్నట్లు పేర్కొంది. నీట్ యూజీ నిర్వహణకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. కేంద్రం దాఖలు చేసిన అఫిడవిట్‌పై స్పందన తెలియజేయాలని సంబంధిత పిటిషనర్లు, వైద్యుల సంఘానికి సూచించింది. తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. ఇదిలా ఉండగా, నీట్‌ను కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించే నిర్ణ యం తీసుకుంటే.. అభ్యర్థులకు ముందుగానే స్పష్ట మైన సమాచారం ఇవ్వాలని వైద్యుల సంఘం కోరిం ది. పరీక్షా విధానంలో మార్పులు చేసేటప్పుడు విద్యార్థులకు తగిన సమయం, సన్నద్ధత కల్పించాలని పేర్కొంది.

# రోడ్ నెట్‌వర్క్‌కు ఏకీకృత వ్యవస్థ

- హెచ్‌ఎండీఏ పరిధిలో రోడ్ల అభివృద్ధి పనులపై సీఎం రేవంత్ సమీక్ష
- ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లన్నీ ఒకే వ్యవస్థ పరిధిలోకి తేవాలి
- రేడియల్ రోడ్డు–1ను డిసెంబర్ 9 నాటికి పూర్తిచేయాలని అధికారులకు ఆదేశం



ప్రజానావ, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరిచేందుకు రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించిన అన్ని పనులను ఒకే వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హెచ్‌ఎండీఏ పరిధిలో చేపడుతున్న రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమీక్షలో హెచ్‌ఎండీఏ, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్), నగరంలోని ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఇతర రహదారుల అభివృద్ధి పనులపై సీఎం ఆరా తీశారు. రోడ్ల నిర్మాణంలో కీలకమైన భూసేకరణ, రుణ సమీకరణ, నిర్వహణ అంశాలపై సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఓఆర్ఆర్ నిర్వహణలో లోపాల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్న సీఎం.. రహదారిపై వాహనాల నిలుపుదల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### నాణ్యత విషయంలో రాజీవద్దు

రేడియల్ రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సీఎం స్పష్టం చేశారు. కొంగరకలాన్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు చేపట్టిన రేడియల్ రోడ్డు–1 పనులను డిసెంబర్ 9 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణాల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని సూచించారు. రోడ్లకు ఇరువైపులా పచ్చదనం పెంపొందించేలా చర్యలు చేపట్టాలని, బుద్వేల్ ట్రంపెట్ ఇంటర్‌చేంజ్ నిర్మాణం, బంజారాహిల్స్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు ఎలివేటెడ్ కారిడార్ పనులను త్వరగా ప్రారంభించాలని పేర్కొన్నారు. హైదరాబాద్ మహానగర భవిష్యత్తు రోడ్ల విస్తరణ, అభివృద్ధిపైనే ఆధారపడి ఉందని సీఎం అన్నారు. ఇందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, అలసత్వానికి తావివ్వరాదని అధికారులకు స్పష్టం చేశారు. రోడ్ల విస్తరణ కోసం చేపట్టే ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యం ఉండకూడదని సీఎం సూచించారు. టీఆర్‌డీఆర్‌ల జారీ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



## జయశంకర్‌కు సీఎం నివాళి

- తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్తగా ఆయన పాత్ర చిరస్మరణీయం
- ఆయన ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రప టానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతపరమైన దిశానిర్దేశం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన జీవితాంతం అహర్నిశలు శ్రమించారని కొనియాడారు. ప్రొ.జయశంకర్ ఆశయాలు, లక్ష్యాల సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలంగాణ సమాజానికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు.

# సామాజిక న్యాయమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును వచ్చే బడ్జెట్ సమావేశాల్లోనే ఆమోదించి కేంద్రానికి పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రపతి ఆమోదం వచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. అలా చేయకపోతే వెయ్యి కార్లతో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమాజంలోని అన్ని వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక స్వావలంబన కల్పించడమే నిజమైన సామాజిక న్యాయమని కవిత పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళలు, ఆదివాసీలు, ట్రాన్స్‌జెండర్లు, వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

### సభలో పలు తీర్మానాలు

సభలో సామాజిక న్యాయ తెలంగాణ కోసం ప్రతిజ్ఞ చేయించిన కవిత, బీసీ రిజర్వేషన్లు, మహిళలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్లు, ఎస్సీ–ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, ఆదివాసీల అటవీ హక్కులు, మైనారిటీల సంక్షేమం, ట్రాన్స్‌జెండర్లకు పూర్తి హక్కులు, వికలాంగుల సంక్షేమం తదితర అంశాలపై పలు తీర్మానాలను ప్రతిపాదించగా సభికులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం సామాజిక న్యాయ తెలంగాణ కోసం చేసిన ప్రతిజ్ఞకు సంబంధించిన వీడియోను కవిత ఎక్స్ (ట్విట్టర్)లో పోస్టు చేయగా, #TRS4 SocialJustice హ్యాష్‌ట్యాగ్ దేశవ్యాప్తంగా ట్రెండింగ్‌లో నిలవడం విశేషంగా మారింది. పార్టీ శ్రేణులు దీనిని స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశాయి.

# యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు!

- పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్ట సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- అవసరమైతే యూపీఐ, ఇతర డిజిటల్ చెల్లింపులపై కేంద్రానికి ఎండీఆర్ విధించే అధికారం
- ఛార్జీలపై నోటిఫికేషన్ ద్వారా తుది నిర్ణయం తీసుకోనున్న ప్రభుత్వం




న్యూఢిల్లీ: యూపీఐతో పాటు ప్రభుత్వం నోటిఫై చేసే ఇతర డిజిటల్ చెల్లింపు విధానాలపై అవసరమైతే బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు (పీఎస్‌పీలు) చార్జీలు (మర్చంట్ డిస్కౌంట్ రేట్–ఎండీఆర్) వసూలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి అధికారం కల్పించే పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టం–2007 సవరణ బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టంలోని సెక్షన్ 10ఏ ప్రకారం యూపీఐ వంటి నిర్దిష్ట డిజిటల్ చెల్లింపులపై బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు ఎలాంటి చార్జీలు విధించడానికి వీలు లేదు. తాజా సవరణతో ఆ నిబంధనను మార్చి, కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఏయే డిజిటల్ చెల్లింపు విధానాలపై చార్జీలు అనుమతించాలో నిర్ణయించే వెసులుబాటు కల్పించారు. ఈ బిల్లు ఆమోదం పొందినంత మాత్రాన యూపీఐపై వెంటనే చార్జీలు అమల్లోకి రావని ప్రభుత్వం స్పష్టం చేసింది. అవసరమైతే భవిష్యత్తులో నోటిఫికేషన్ జారీ చేసి మాత్రమే ఎండీఆర్‌ను అమలు చేయవచ్చని పేర్కొంది. డిజిటల్ చెల్లింపు వ్యవస్థను నిర్వహించేందుకు అయ్యే వ్యయాన్ని భరించేందుకు స్థిరమైన ఆదాయ నమూనా అవసరమనే ఉద్దేశంతో ఈ సవరణ తీసుకొచ్చినట్లు తెలిపింది.

### ఎవరో ఒకరు భరించాల్సిందే

ఈ అంశంపై ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందిస్తూ, యూపీఐపై ఎండీఆర్ విధింపు నిర్ణయం గురించి ఇప్పుడే మాట్లాడటం తొందరపాటేనన్నారు. డిజిటల్ చెల్లింపు మౌలిక సదుపాయాల నిర్వహణకు అయ్యే ఖర్చును ఎవరో ఒకరు భరించాల్సిందేనని, అది పన్నుల రూపంలో ప్రజలైనా, లేక వినియోగదారులు లేదా వ్యాపారులైనా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చట్ట సవరణ తీసుకొచ్చిందని, భవిష్యత్తు పరిణామాలను వేచి చూడాలని సూచించారు.

# సింగరేణికి నైనీ బొగ్గు

(మొదటిపేజీ తరువాయి)

చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు వెల్లడించింది. అనంతరం 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తిని వర్చువల్ విధానంలో ప్రారంభించగా, అక్కడి నుంచి బయలుదేరిన తొలి బొగ్గు రైలు 1,131 కిలోమీటర్లు ప్రయాణించి తెలంగాణకు చేరుకుంది.

### విద్యుత్ ఉత్పత్తికి మరింత ఊతం

2015 ఆగస్టు 13న కేంద్ర బొగ్గు శాఖ సింగరేణికి కేటాయించిన నైనీ బొగ్గు గనిలో సుమారు 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. 36 సంవత్సరాల జీవితకాలం కలిగిన ఈ గని నుంచి ఏటా కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. నైనీ గని నుంచి నాణ్యమైన బొగ్గు అందుబాటులోకి రావడంతో జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు ఇంధన సరఫరా మరింత బలోపేతం కానుంది. దీంతో రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తికి ఆటంకాలు తొలగి, భవిష్యత్తులో నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్య సాధనకు ఇది కీలకంగా మారుతుందని ప్రభుత్వం పేర్కొంది.

# నకిలీ ఎన్‌ఓసీలతో కాలేజీల అక్రమాలు

- హైడ్రా దర్యాప్తులో వరుసగా వెలుగుచూస్తున్న కొత్త వివరాలు
- మరో 48 ఇంటర్ కాలేజీల జాబితా పోలీసులకు అందజేసిన హైడ్రా

ప్రజానావ, హైదరాబాద్: ఇంటర్ కాలేజీల్లో నకిలీ ఫైర్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు (ఎన్‌ఓసీలు) సమర్పించిన వ్యవహారంలో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ఈ కేసులో తాజాగా మరో 48 ఇంటర్ కాలేజీల వివరాలను హైడ్రా అధికారులు పోలీసులకు అందజేయగా, నకిలీ ధ్రువపత్రాల వ్యవహారంలో ఒకే తరహా విధానాన్ని అనుసరించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఇప్పటికే 56 ఇంటర్ కాలేజీలు నకిలీ ఫైర్ ఎన్‌ఓసీలు సమర్పించినట్లు హైడ్రా అధికారులు నిర్ధారించారు. అదేవిధంగా మరో 176 కాలేజీలకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఐదు అంతస్తుల లోపు ఉన్న భవనాలకు ఫైర్ ఎన్‌ఓసీలు జారీ చేసే అధికారం హైడ్రా పరిధిలో ఉండగా, ఈ వ్యవస్థను దుర్వి నియోగం చేస్తూ కొందరు కాలేజీ యాజమాన్యాలు అక్రమాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. హైడ్రాకు ఎలాంటి దరఖాస్తు చేయకుండానే నకిలీ ఫైర్ ఎన్‌ఓసీలను రూపొందించి వాటిని ఇంటర్ బోర్డుకు సమర్పించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నకిలీ ధ్రువపత్రాల కోసం ఒక్కో కాలేజీ యాజ మాన్యం రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. దర్యాప్తులో మరో కీలక విషయం కూడా వెలుగులోకి వచ్చింది. జీహెచ్‌ఎంసీ, హైడ్రా, అగ్నిమాపక శాఖ మాజీ డైరెక్టర్ జనరల్ల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ ఎన్‌ఓసీలు రూపొందించినట్లు అధికారులు గుర్తిం చారు. సంబంధిత కాలేజీ యాజమాన్యాలను విచారి స్తే ఈ అక్రమాల వెనుక ఉన్న ప్రధాన సూత్రధారులు, మధ్యవర్తుల పాత్రపై మరిన్ని వివరాలు బయటపడే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. హైడ్రా సమర్పించిన నివేదికతో పాటు ఇప్పటివరకు సేకరించిన ఆధారాల ఆధారంగా సంబంధిత కాలేజీ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమవుతున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# కేటీఆర్‌తో ప్రకాశ్ అంబేద్కర్ భేటీ

- రాజకీయ పరిణామాలు, పలు అంశాలపై చర్చ
- పార్టీ నేతలను పరిచయం చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

ప్రజానావ, హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో వంచిత్ బహుజన్ అగాడీ (వీబీఏ) అధినేత ప్రకాశ్ అంబేద్కర్ గురువారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. బంజారాహిల్స్‌లోని కేటీఆర్ నివాసంలో జరిగిన ఈ భేటీలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకులను కేటీఆర్ ప్రకాశ్ అంబేద్కర్‌కు పరిచయం చేశారు. భేటీ అనంతరం ప్రకాశ్ అంబేద్కర్‌ను కేటీఆర్ శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సమావేశం సందర్భంగా ఇరువురు నేతలు తాజా రాజకీయ పరిస్థితులు, సామాజిక అంశాలపై చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# మోదీ విదేశీ పర్యటనలకు రూ.483 కోట్లు

- ఐదేళ్లలో మోదీ అధికారిక పర్యటనల ఖర్చు వివరాలు వెల్లడించిన కేంద్రం
- పర్యటనల ఫలితంగా రూ.31.69 లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులు
- 2025లో 23 దేశాల పర్యటనలకు రూ.187 కోట్లు
- ఈ ఏడాది ఇప్పటివరకు రూ.74.58 కోట్లు ఖర్చు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలకు సంబంధించిన ఖర్చు వివరాలను కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. 2021 నుంచి 2025 డిసెంబర్ వరకు ప్రధానమంత్రి అధికారిక విదేశీ పర్యటనల కోసం మొత్తం రూ.482.92 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపింది. ఇదే కాలంలో వివిధ దేశాలతో కుదిరిన ఒప్పందాలు, భాగస్వామ్యాల ఫలితంగా భారత్‌కు 381.8 బిలియన్ అమెరికన్ డాలర్ల (సుమారు రూ.31.69 లక్షల కోట్లు) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వచ్చినట్లు పేర్కొంది. రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గెరిటా లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2021 నుంచి ఇప్పటివరకు ప్రధానమంత్రి ఏయే దేశాల్లో పర్యటించారు, ఒక్కో ఏడాది ఎంత ఖర్చు అయ్యింది అనే వివరాలను సభకు అందించారు. విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం 2025లో ప్రధానమంత్రి 23 దేశాల్లో అధికారిక పర్యటనలు నిర్వహించగా, వాటికి రూ.187 కోట్లు వ్యయమయ్యాయి. 2024లో రూ.109 కోట్లు, 2023లో రూ.93 కోట్లు, 2022లో రూ.55 కోట్లు, 2021లో రూ.36 కోట్లు ఖర్చయ్యాయి. 2026లో ఇప్పటివరకు జరిగిన విదేశీ పర్యటనలకు రూ.74.58 కోట్లు వ్యయమైనట్లు వెల్లడించింది. గత ఏడాది ప్రధానమంత్రి ఫ్రాన్స్, అమెరికా, సౌదీ అరేబియా, బ్రెజిల్, చైనా, బ్రిటన్‌తో పాటు మారిషస్, థాయ్‌లాండ్, శ్రీలంక, సైప్రస్, కెనడా, క్రొయేషియా, ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, నమీబియా, మాల్దీవులు, జపాన్, భూటాన్, దక్షిణాఫ్రికా, జోర్డాన్, ఒమన్, ఇథియోపియా దేశాల్లో పర్యటించారు. వీటిలో ఫ్రాన్స్ పర్యటనకు రూ.25 కోట్లు, బ్రెజిల్‌కు రూ.17 కోట్లు, అమెరికాకు రూ.16 కోట్లు, సౌదీ అరేబియాకు రూ.15 కోట్లు, చైనా పర్యటనకు రూ.10 కోట్లు, బ్రిటన్‌కు రూ.9 కోట్లు ఖర్చైనట్లు తెలిపింది. ఈ ఏడాది జూలై 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో ప్రధానమంత్రి పర్యటించినట్లు విదేశాంగ శాఖ పేర్కొంది.

## ప్రతి రూపాయికి సుమారు రూ.66 వేల పెట్టుబడి

ప్రధానమంత్రి విదేశీ పర్యటనలు ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, ప్రాంతీయ–అంతర్జాతీయ సహకార విస్తరణ, వాణిజ్య, పెట్టుబడుల పెంపునకు కీలకంగా దోహదపడుతున్నాయని విదేశాంగ శాఖ పేర్కొంది. 2021 ఏప్రిల్ నుంచి 2025 డిసెంబర్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందాల ఫలితంగా భారత్‌కు భారీ స్థాయిలో విదేశీ పెట్టుబడులు వచ్చాయని వెల్లడించింది. విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం, ప్రధానమంత్రి విదేశీ పర్యటనలపై ఖర్చు చేసిన ప్రతి రూపాయికి సుమారు రూ.66 వేల విలువైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు దేశానికి లభించినట్లు వివరించింది.

# తెలంగాణ గొంతు బలహీనపడొద్దు

- కేసీఆర్ వంటి నాయకత్వమే తెలంగాణ ప్రయోజనాలను కాపాడుతుంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలంటే బలమైన ప్రాంతీయ నాయకత్వం అవసరమని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వంటి నాయకత్వమే రాష్ట్ర హక్కులను సమర్థంగా కాపాడగలదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఢిల్లీపై ఆధారపడే రాజకీయాల వల్ల తెలంగాణ స్వరం బలహీనపడుతుందని, రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కె. జయశంకర్ జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ అందించిన స్ఫూర్తి, కేసీఆర్ చూపిన నాయకత్వమే రాష్ట్ర సాధనకు బలమైన పునాది అయ్యాయని ఆయన అన్నారు. తెలంగాణ కోసం ఏర్పడిన ప్రాం తీయ రాజకీయ శక్తి అధికారంలో ఉంటే రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగే పరిస్థితులు తలెత్తేవి కావని వ్యాఖ్యానించారు. తెలంగాణకు సంబంధిం చిన కీలక అంశాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన స్థాయిలో స్పందించడం లేదని కేటీఆర్ విమర్శించారు. ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులు, రాష్ట్ర హక్కులు వంటి అంశాల్లో తెలంగాణ ప్రయోజ నాలను బలంగా వినిపించాల్సిన అవసరం ఉందన్నా రు. రాష్ట్ర హక్కులకు భంగం కలిగించే పరిణామాలపై అధికార పార్టీ మౌనం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు.

### ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను సహించం

పార్లమెంట్‌లో తెలంగాణ విభజనపై చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్, బీజేపీ ప్రజాప్రతినిధులు గట్టిగా స్పందించకపోవడం బాధాకరమని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి తరచూ ఢిల్లీ పర్యటనలు చేయడాన్ని ప్రస్తావిస్తూ, ఢిల్లీపై ఆధారపడే రాజకీయాలు రాష్ట్రానికి ప్రయోజనం చేకూర్చవని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ స్వాభిమానం, రాష్ట్ర హక్కుల పరిరక్షణకు స్వతంత్ర రాజకీయ అస్తిత్వమే బలమని, ప్రొఫెసర్ జయశంకర్ చూపిన మార్గంలోనే బీఆర్ఎస్ ముందుకు సాగుతుందని ఆయన తెలిపారు.

## సర్ 2026 ఓటరు జాబితా సవరణకు రాజకీయ పార్టీలు సహకరించాలి

**కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**ప్రజానావ, సూర్యాపేట:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్–2026) ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, తప్పుల్లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జూలై 24తో ముగియాల్సిన బీఎల్ఓల ఇంటింటి సర్వే గడువును క్షేత్రస్థాయిలో మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు ఆగస్టు 10 వరకు పొడిగించినట్లు వెల్లడించారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని, సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసే డిజిటలైజేషన్ ప్రక్రియ కూడా పూర్తయిందని తెలిపారు. ఓటరు జాబితాలో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉండటం, మరణించిన వారి పేర్లు కొనసాగడం వంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రాజకీయ పార్టీల నాయకులు బీఎల్ఓలు, బూత్ లెవల్ ఏజెంట్లతో సమన్వయం చేసుకుని ఆగస్టు 10 వరకు ఉన్న గడువులో ఓటరు వివరాలను పరిశీలించి తప్పులు లేకుండా చూడాలని సూచించారు. 2026 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే యువతీ యువకులందరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై కూడా సమావేశంలో చర్చించారు. జిల్లాలోని ఓటర్లు తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని, బీఎల్ఓలు ప్రతి రాజకీయ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకుని ఓటరు జాబితా ప్రక్షాళనలో అధికారులకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్‌రాజ్, సీ సెక్షన్ సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ నుంచి సీహెచ్ రాజేశ్వరరావు, బీజేపీ నుంచి చల్లమల్ల నరసింహా, ఎండీ హాబిద్, బీఎస్పీ నుంచి ఎం. స్టాలిన్, బీఆర్ఎస్ నుంచి కరుణాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నుంచి డి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.





## సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం
# సమరసతకు చిరునామా

- రామానుజుల సమానత్వ సందేశం నేటికీ సజీవం
- ముచ్చింతల్‌లో సమతా మూర్తి స్ఫూర్తి కేంద్ర సందర్శనలో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- గవర్నర్‌కు రామానుజాచార్యుల వారి జీవిత చరిత్ర పుస్తకాలను బహూకరించిన త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి
- ఇది గొప్ప ఆధ్యాత్మిక అనుభూతి.. సమానత్వ సారాన్ని ప్రత్యక్షంగా ఆస్వాదించాను అని సందర్శకుల పుస్తకంలో పేర్కొన్న గవర్నర్



ప్రజానావ, ముచ్చింతల్: ముచ్చింతల్‌లోని శ్రీ సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం ఆధ్యాత్మికత, సమరసత, సమానత్వ విలువలకు చిరస్థాయిగా నిలిచే దివ్యక్షేత్రమని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. గురువారం తన సతీమణి శ్రీమతి జానకి శుక్లాతో కలిసి తొలిసారిగా సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించిన గవర్నర్, ఈ పుణ్యక్షేత్రం తనకు అపూర్వమైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు. బ్యాటరీ వాహనంలో స్ఫూర్తి కేంద్రాన్ని పరిశీలించిన గవర్నర్ దంపతులు, సమతామూర్తిని దర్శించుకున్నారు. వేద పండితులు గవర్నర్ దంపతులకు తీర్థ ప్రసాదాలు అందించి వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం 216 అడుగుల ఎత్తైన శ్రీ రామానుజాచార్యుల పంచలోహ విగ్రహాన్ని దర్శించుకున్నారు. తదనంతరం సమతా మూర్తి కేంద్రంలోని 108 దివ్యదేశాల విశిష్టతను తెలుసుకున్నారు. కేంద్ర విశేషాలను అహోబిల జీయర్ స్వామి, కృష్ణ స్వామి గవర్నర్ దంపతులకు వివరించారు. హారతి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం వైకుంఠనాథ భగవానుడిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చివరగా స్వామీజీ కుటీరంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామిని గవర్నర్ దంపతులు కలిశారు. ఈ సందర్భంగా శ్రీ రామానుజాచార్యుల విశిష్ట సేవలు, విశిష్టాద్వైత తత్వం, సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం నిర్మాణ లక్ష్యం, ఇక్కడ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల గురించి జీయర్ స్వామి వివరించారు. అనంతరం గవర్నర్ దంపతులను శాలువాతో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి సత్కరించి సమతా మూర్తి ప్రతిమ, భగవత్ రామానుజ పుస్తకాన్ని , శ్రీ రామానుజచార్యుల వారి జీవిత చరిత్ర, చిత్ర కథ, సత్య సంకల్ప పుస్తకాలు సహా పలు పుస్తకాలను బహుకరించారు. ఆశీస్సులు అందజేశారు.

**గవర్నర్ స్వామివారికి మెమెంటో అందజేత**

ఈ సందర్భంగా గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ, సమతా మూర్తి విగ్రహం సమరసతకు, సామాజిక సమానత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. దేశంలో అత్యంత విశిష్టమైన ఆధ్యాత్మిక క్షేత్రాల్లో సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం ఒకటిగా నిలిచిందన్నారు. వేదాలు బోధించిన విలువలను శ్రీ రామానుజాచార్యులు తమ జీవితంలో ఆచరించి చూపారని కొనియాడారు. వెయ్యేళ్ల క్రితమే జాతి, భాష, వర్ణ భేదాలకు అతీతంగా సమానత్వ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన మహనీయుడని పేర్కొన్నారు. విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ప్రపంచానికి చాటిచెప్పి భక్తి ఉద్యమానికి నూతన దిశానిర్దేశం చేసిన మహోన్నత ఆధ్యాత్మిక విప్లవకారుడిగా శ్రీ రామానుజులను అభివర్ణించారు. దేవుడిని ఆరాధించడం, మోక్షాన్ని పొందడం ప్రతి మానవుడి హక్కు. ఆ హక్కును నిరాకరించే అధికారం ఎవరికీ లేదు. దేవుని దృష్టిలో అందరూ సమానులే అనే శ్రీ రామానుజాచార్యుల సందేశం యుగయుగాలకు మార్గదర్శకమని గవర్నర్ అన్నారు. వ్యక్తిగత శ్రేయస్సుకంటే సమాజ శ్రేయస్సే ముఖ్యమనే ఆయన బోధనలు నేటి సమాజానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. సందర్శన అనంతరం సందర్శకుల పుస్తకంలో గవర్నర్ తన అభిప్రాయాన్ని నమోదు చేశారు. చ్చింతల్‌లోని సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రాన్ని తొలిసారిగా సందర్శించాను. ఈ దివ్యక్షేత్రం నాకు గొప్ప ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది. సమానత్వ సారాన్ని ప్రత్యక్షంగా అనుభవించే అవకాశం లభించింది. ఈ మహత్తర కేంద్రాన్ని నిర్మించిన స్వామీజీ, జీయర్ స్వామి, వారి బృందానికి హృదయపూర్వక అభినందనలు అని రాసి సంతకం చేశారు.

### తెలంగాణ నేతన్నలకు జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్

జాతీయ చేనేత దినోత్సవం (ఆగస్టు 7) సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని నేతన్నలందరికీ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం లోక్ భవన్ ఒక ప్రకటన విడుదల చేసింది. చేనేత హస్తకళ భారతీయ సంస్కృతికి ప్రతీక అని, అగ్గిపెట్టెలో పట్టే చీరలను నేసిన అపూర్వ నైపుణ్యం కలిగిన కళాకారులు మన నేతన్నలని కొనియాడారు. తెలంగాణకు చేనేత పరిశ్రమ గొప్ప వారసత్వమని, వేలాది కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తోందని గవర్నర్ పేర్కొన్నారు. నైపుణ్యం, సంప్రదాయం, కళాత్మకత కలగలిసిన తెలంగాణ చేనేత దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. పోచంపల్లి ఇక్కత్, గద్వాల పట్టు, నారాయణపేట, సిరిసిల్ల, కొత్తకోట చేనేత వస్త్రాలు తెలంగాణ కళా వైభవాన్ని ప్రపంచానికి చాటిచెబుతున్నాయని అన్నారు. సమాజానికి సంస్కృతిని నేర్పిన నేర్పరులు నేతన్నలు. వారి శ్రమ, సృజనాత్మకత మన చేనేతకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయి అని గవర్నర్ పేర్కొన్నారు.

## ఫిల్మ్‌నగర్ 18 బస్తీల బోనాల ఉత్సవాలకు జీహెచ్ఎంసీ సన్నద్ధం

- ఆలయాల పరిసరాల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, ఊరేగింపు మార్గాలపై ప్రత్యేక చర్యలు



**ప్రజానావ, ఖైరతాబాద్:** ఫిల్మ్‌నగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో రానున్న బోనాల పండుగ ఏర్పాట్లపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జీహెచ్ఎంసీ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ శంకర్ ముఖ్య అతిథిగా హాజరై బస్తీల ఆలయ కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా వివిధ బస్తీలలో బోనాల ఉత్సవాల తేదీలను ప్రకటించారు. వినాయక్ నగర్‌లో ఆగస్టు 11, బాలరెడ్డి నగర్, పటేల్ నగర్‌లో ఆగస్టు 16, బసవతారక నగర్, దుర్గాభవాని నగర్, బాబు నాయుడు నగర్‌లో ఆగస్టు 23, అలాగే భగత్‌సింగ్ కాలనీ, స్వామి వివేకానంద నగర్, బీజేఆర్ నగర్, జ్ఞాని జైల్‌సింగ్ నగర్, అంబేద్కర్ నగర్ (రోడ్ నెం.9)లో ఆగస్టు 9న బోనాల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా వీధి దీపాలు, మినీ మాస్ట్ లైట్లు వెలగకపోవడం, ఆలయాల పరిసరాల్లో చెత్త, నిర్మాణ వ్యర్థాలు పేరుకుపోవడం, బోనాల ఊరేగింపు మార్గాల్లో చెట్ల కొమ్మలు అడ్డుగా ఉండడం వంటి అంశాలపై ఫిర్యాదులు చేశారు. దీనిపై స్పందించిన డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ శంకర్, జీహెచ్ఎంసీ తరఫున అన్ని శాఖలతో సమన్వయం చేసి పారిశుద్ధ్య పనులు, వీధి దీపాల మరమ్మతులు, తాత్కాలిక హాలోజన్ లైట్ల ఏర్పాటు, చెత్త మరియు నిర్మాణ వ్యర్థాల తొలగింపు, ఊరేగింపు మార్గాల్లో చెట్ల కొమ్మల కత్తిరింపు వంటి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. బోనాల పండుగ విజయవంతం కావడానికి ఆలయ కమిటీలు, ప్రజల సహకారం కూడా అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ ఏఈఈ వెంకటేష్, వాటర్ సప్లై మేనేజర్ అభిషేక్, ట్రాన్స్‌కో ఏఈఈ పవిత్ర, ఫిల్మ్‌నగర్ సెక్టర్ ఎస్ఐ సలీం, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకుల రాజు, నాగేశ్ సాగర్, ఎల్లయ్య, పద్మ, ధనమ్మ, సుగుణ, సుధాకర్ రెడ్డితో పాటు వివిధ బస్తీల ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో కుట్ర రాజకీయాలకు తావులేదు

- నాన్ లోకల్ అనడం ఆదివాసీ బిడ్డను అవమానించడమే..
- పార్టీని బలహీనపరిచే వారికి కార్యకర్తలే గుణపాఠం చెబుతారు
- డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క



**ప్రజానావ, ఆసిఫాబాద్:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో కొందరు నాయకులు వ్యక్తిగత స్వార్థం, పదవుల రాజకీయాల కోసం కావాలనే వర్గ విభేదాలను రెచ్చగొట్టి పార్టీని బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ఆరోపించారు. ఇలాంటి కుట్ర రాజకీయాలను కాంగ్రెస్ కార్యకర్తలు ఎప్పటికీ సహించరని, పార్టీకి నష్టం కలిగించే వారికి తగిన సమయంలో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కలిసి కొందరు కార్యకర్తలను ప్రలోభపెట్టి హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు తీసుకెళ్లి తనపై ఆరోపణలు చేయించారని ఆరోపించారు. ఇది కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేసే ప్రయత్నం కాదని, కొందరు నాయకులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఆడుతున్న నాటకమని విమర్శించారు. తనను నాన్ లోకల్‌గా చిత్రీకరించడం జిల్లా ప్రజలను, ముఖ్యంగా ఆదివాసీ సమాజాన్ని అవమానించడమేనని సుగుణక్క అన్నారు. తాను సిర్పూర్ (యూ) మండలం పుల్లార గ్రామంలో జన్మించి ఇదే నేలపై పెరిగిన ఆదివాసీ బిడ్డనని స్పష్టం చేశారు. ఈ మట్టితో తనకు ఉన్న అనుబంధాన్ని, హక్కును ప్రశ్నించే నైతిక అధికారం ఎవరికీ లేదన్నారు. 1995లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీటీసీగా గెలిచినప్పటి నుంచి ఇప్పటివరకు పార్టీ మారలేదని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ తనకు ఎంపీ టికెట్ ఇచ్చిందని, పార్టీ పట్ల నిబద్ధత, పనితీరును గుర్తించిన అధిష్ఠానం టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, డీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించిందని చెప్పారు. అధిష్ఠానం తీసుకున్న నిర్ణయాలను కొందరు వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రశ్నించడం అంటే పార్టీ నాయకత్వాన్నే అవమానించడమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, మండల అధ్యక్షులు రాపర్తి మురళి, మీర్ కాసిమ్ ఇమ్రాన్, సుజియత్, రషీద్, కిషన్ గౌడ్, గణపతి, మెంగజీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, జిల్లా కార్యవర్గ సభ్యులు గాదవేణి మల్లేష్, తారీక్, కట్కర్ భీమ్రావు, శోభన్, చిరంజీవి, ప్రకాష్, బాదు పటేల్, శంకర్, పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా కో–ఆర్డినేటర్ కోవ ఇందిరా, ఆత్మ చైర్మన్ గడ్డల సత్తయ్య, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు కమల్ నాథ్ రెడ్డి, నాంపల్లి శంకర్, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుజాయిత్ ఖాన్, మెంగజీ, రషీద్, ఆంజనేయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేములవాడలో డీఐజీ సన్‌ప్రీత్ సింగ్ పర్యటన

**ప్రజానావ, వేములవాడ:** రాజన్న జోన్–3 డీఐజీ సన్‌ప్రీత్ సింగ్ గురువారం వేములవాడ సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయాన్ని సందర్శించి క్రైమ్ రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించారు. గ్రేవ్, పోక్సో కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి నిందితులకు శిక్షలు పడేలా పటిష్టమైన సాక్ష్యాధారాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే 5S విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని సూచించారు. వేములవాడకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట భద్రత, ట్రాఫిక్ నిర్వహణ చేపట్టాలని, ఆలయ పరిసరాల్లో గస్తీని మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. అనంతరం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలోని భీమేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మహేష్ బి. గితే, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి

**ప్రజానావ, గంభీరావుపేట:** తెలంగాణ సిద్ధాంతకర్త స్ఫూర్తి దాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు గురువారం గంభీరావుపేట మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్, మేజర్ పంచాయతీ, డిగ్రీ కళాశాలలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జయశంకర్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచి చిరస్థాయిగా నిలుస్తాయని కొనియాడారు. ఆయా కార్యక్రమాలను ఎస్సై శ్రీకాంత్, సర్పంచ్ మల్లుగారి పద్మ, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తో పాటు ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని పలు పాఠశాలలో జయంతి వేడుకలు నిర్వహించారు.

## ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఆయిల్ పామ్ సాగు లక్ష్యంపై అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం



**ప్రజానావ, సిరిసిల్ల :** జిల్లాలో నిర్దేశించిన ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవాలని, డ్రిప్ సౌకర్యం కల్పించడం, మొక్కలు నాటే ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రి–యునిక్ కంపెనీ, డ్రిప్ కంపెనీల ప్రతినిధులతో ఆయిల్ పామ్ సాగు పురోగతి, లక్ష్యాన్ని చేరుకోవడంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు ఆయిల్ పామ్ మొక్కలు నాటే ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లక్ష్య సాధనలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు వల్ల రైతులకు కలిగే ఆర్థిక ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సబ్సిడీలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం సకాలంలో అందేలా ఉద్యాన, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన అధికారి ఆర్ శరత్ బాబు, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## జయశంకర్ ఆశయాలను కొనసాగిస్తాం

**ఖాదర్ పాషా**

**ప్రజానావ ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ సార్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టిజెఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు ఎం.ఎ. ఖాదర్ పాషా పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీ చౌరస్తా వద్ద ఉన్న జయశంకర్ విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలిదశ ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు జయశంకర్ అని, స్వరాష్ట్రంలో ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం టిజెఎస్ ఎల్లప్పుడూ పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ హకీమ్ యాదగిరి, కో–కన్వీనర్ రమేష్, నాయకులు వేణుగోపాల్, జోసెఫ్, రామస్వామి, వంశీ, నారాయణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని తెలంగాణ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి

**పీఆర్‌టీయూ**



**ప్రజానావ, వేములవాడ :** ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతిని ప్రతి సంవత్సరం తెలంగాణ ఉపాధ్యాయ దినోత్సవంగా అధికారికంగా ప్రకటించాలని పీఆర్‌టీయూ తెలంగాణ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు మ్యాడారం హరికృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. జయశంకర్ సార్ విద్యావేత్తగా, తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్తగా చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను భావితరాలకు చేరవేయాలంటే ఈ నిర్ణయం తీసుకోవాలని అన్నారు. అనంతరం పీఆర్‌టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మ్యాడారం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి, హరేందర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యనారాయణ, జిల్లా బాధ్యులు సరోజ, శిరోమణి, శీలం రమేష్, వెంకటరమణ, శ్రీనివాస్, వైదేహి జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## జయశంకర్ సేవలు చిరస్మరణీయం: ఎస్పీ జానకి

**ప్రజానావ ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర సాధనకు సిద్ధాంతకర్తగా, ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటిచెప్పి తన యావజ్జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి కొనియాడారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన జయశంకర్ జయంతి వేడుకల్లో ఆమె పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ ఆవశ్యకతను దేశవిదేశాల్లో చాటుతూ, ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపిన మహోన్నత వ్యక్తి జయశంకర్ అని అన్నారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పోలీసు సిబ్బంది ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శకమైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ రమణారెడ్డి, ఏఓ రుక్మిణి భాయ్, ఆర్ఐ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# పార్లమెంట్ పరువు ఎటు?

అధికార, విపక్షాల పట్టుతో సమావేశాలు సాగడం లేదు. గందర గోళం మధ్యనే ప్రభుత్వం బిల్లులు పాస్ చేసుకుంటూ పోతోంది. విపక్షం కూడా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లు అన్నచందంగా సాగుతోంది. చర్చలు జరక్కుండా ప్రజాధనం వృధా చేస్తున్నారు. వర్షాకాల సమావే శాలు కూడా ఎలాంటి పురోగతి లేకుండా ముగింపు దశకు చేరుకున్నాయి. వర్షాకాల సమావే శాలు కూడా ఎలాంటి పురోగతి లేకుండా ముగింపు దశకు చేరుకున్నాయి. ఇది నిజంగా పార్లమెంట్ చరిత్రలో మాయని మచ్చగా నిలిచిపోవడం ఖాయం.

పార్లమెంట్ సమావేశాలు నానాటికీ దిగజారి పోతున్నాయి. అధికార, విపక్షాల పట్టుతో సమావేశాలు సాగడం లేదు. గందర గోళం మధ్యనే ప్రభుత్వం బిల్లులు పాస్ చేసుకుంటూ పోతోంది. విపక్షం కూడా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లు అన్నచందంగా సాగుతోంది. చర్చలు జరక్కుండా ప్రజాధనం వృధా చేస్తున్నారు. వర్షాకాల సమావే శాలు కూడా ఎలాంటి పురోగతి లేకుండా ముగింపు దశకు చేరుకున్నా యి. అసలు మోడీ హయాంలో చర్చలు సాగడం లేదని అనుకుంటుంటే విపక్షం అంతకుమించి అన్నట్లుగా పార్లమెంట్ స్తంభన పట్టుబుడతోంది. ఇది నిజంగా పార్లమెంట్ చరిత్రలో మాయని మచ్చగా నిలిచిపోవడం ఖాయం. ఎందుకంటే గత కొన్ని ఏళ్లుగా పరిశీలన చేస్తే అసలు చర్చలు సాగడం లేదు. అర్థవంతమైన చర్చలు అస్సలు చేయడం లేదు. విపక్షలు పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించి, పార్లమెంట్ బయట ఆందోళనలు చేస్తున్నాయి. పార్లమెంట్‌లో ఎన్నో అవకాశాలు ఉంటాయి. ఎన్నో రూల్స్ ఉంటాయి. వారు చర్చించాల్సన విషయాలను ఈ పద్దతిలో చర్చించడం లేదు. వలం రాజకీయం క ఓసం రచ్చ మార్గాన్ని ఎన్నుకున్నాయి. ఇకపో తే స్పీకర్ సమర్థతపైనే చట్టసభల్లో సమస్యలపై చర్చ సాగుతుంది. స్పీకర్ నిజాయితీగా, నిష్పక్ష పాతంగా ఉంటే చట్టసభల్లో అర్థవంత మైన చర్చకు అవకాశం ఉంటుంది. అసెంబ్లీ అయినా పార్లమెంట్ అయినా ఇదే వర్తిస్తుంది. గతంలో కాంగ్రెస్ హయాలో అయినా, ఎన్‌డిఎ హయాంలో అయినా చర్చలు ఫలవంతం గా సాగేవి. ప్రతిపక్షాలు ఎక్కడ ఏ సమస్యలు లేవనెత్తుతాయా అని ప్రభుత్వాలు ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేసేవి. నీలం సంజీవరెడ్డి, బలరావ్ జాకఢ్, శివరాజ్ పాటిల్, పీఏ సంగ్మా ఇలా ఎందరో స్పీకర్లు సభాధ్యక్ష స్థానానికి వన్నె తెచ్చారు. సమస్యలపై చర్చలకు అవకాశం ఇచ్చారు. ఇక్కడ చర్చలంటే విపక్షం నుంచే అన్నది వేరుగా చెప్పాల్సిన అవస రం లేదు. అయితే గత 12 ఏళ్లుగా అంటే..మోడీ అధికారం చేపట్టిన తరవాత చట్టసభల్లో అర్థవంతమైన చర్చలకు ఆస్కారం లేకుండా పో యింది. అర్థవంతం కాదు కదా అసలు చర్చల ఆస్కారం కనిపించ డం లేదు. విపక్షం నుంచి ఎవరైనా లేస్తే..స్పీకర్ మైక్ కట్ చేయడం అలవాటు చేసుకున్నారు. అలాంటప్పుడు ప్రజలు ఏమనుకుం టున్నారో ఎలా తెలుస్తుంది. నిజానికి ప్రభుత్వమే చర్చలకు ఆహ్వానిం చాలి. తమ పాలనా విధానాలపై ప్రజల్లో ఎలాంటి ప్రభావం ఉందో అన్నది తెలుసుకోవాలి. అయితే మోడీ ప్రభుత్వం సమస్యలపై చర్చలను కోరుకోవడం లేదు. చర్చ జరిగితే సమాధానం ఇవ్వడం, ఇరుకున పడడం ప్రభుత్వానికి ఇష్టం లేదన్నది అర్థం అవుతోంది. ఇలాంటి సందర్భాల్లో స్పీకర్ జోక్యం చేసుకుని ప్రతిపక్ష సభ్యులతో మాట్లాడ డం, వారిని అనునయించడం జరిగేది. వారు ఏం కోరుకుంటున్నారో మైక్ ఇవ్వడం ద్వారా తెలుసుకోవచ్చు. కానీ లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఏదేని సమస్యపై లేచి నిలబడితే మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదన్న ది ప్రధాన అరోపణ. కనీసం విపక్షనేతకు గౌరవం ఇవ్వాలన్న ఆలోచ న కూడా లేకుండా లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా వ్యవహరిస్తున్నారని విప క్ష సభ్యులు పదేపదే అరోపిస్తున్నారు. సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించే వారికి ఇది స్పష్టంగా కనిపిస్తుంది. ఇక ఈ సీజన్‌లో అసలు విపక్ష సభ్యులు కూడా మాట్లాడకుండా పోడియం వద్దకు రావడం, నినాదాలు చేయడం, వెళ్లిపోవడం అలవాటు చేసుకున్నారు. దీంతో స్పీకర్ కూడా సభను వాయిదా వేసి పోతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోడీ సభకు హాజరు కావడం లేదు. విద్యార్థుల సమస్యలు కావచ్చు, ఇతర సమస్యలు కావచ్చు.. ప్రధాని మాట్లాడడం లేదు. కేవలం సోషల్ మీడియా ద్వారా తన భావాలను వెల్లడిస్తున్నారు. బలాల సంఖ్య ఎలా ఉన్నా విషయం మాత్రం ప్రజలకు కూడా అర్థం అవుతోంది. పార్లమెంట్ సమా వేశాలు ఎన్ని రోజులు జరిగినా మొక్కుబడిగా మమ అనిపిస్తున్నారు. ప్రజ లు ఎదుర్కొం టున్న ప్రధాన సమస్యలపై చర్చ సాగడం లేదు. దేశంలో అవినీతి, అక్రమా లు, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అనేక సమస్య లు ఉన్నాయి. సమావేశాల్లో అనేక అంశాలపై చర్చకు అవకాశం ఉంటుం ది. కానీ విపక్షాలకు అలాంటి అవకాశం రావడం లేదు. వలం ప్రధాని పడికట్టు పదాలతో ఇచ్చే ఉపన్యాసమే ప్రధాన వార్తగా చలామణి అవుతుం ది. వికసిత భారత్, ఆత్మనిర్భర భారత్ వంటి పడికట్టు పదాలు తప్ప దేశం పురోగతికి సంబంధించి న అంశాలపై చర్చలకు ఆస్కారం కలగడం లేదు. వాజ్‌పేయ్, పీవీ నరసింహారావు, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ ప్రధా నులుగా ఉన్న సమయాల్లోనూ పార్లమెంటులో అర్థవంతమైన చర్చలు సాగేవి. కానీ ప్రస్తుతం చర్చలకు ఆస్కారం లేకపోవడంతో విపక్ష ఎంపిలు పోడియం వద్ద ఆందోళన చేయడం, సభనుంచి బయటకు రావడం రివాజుగా మారింది. ఇకపోతే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ విషయంలో ఎందుకనో విపక్షం వైపు చూడడం మానేశారు. విపక్ష సభ్యుల ప్రస్తావన లకు స్పందించడం లేదు. ఇది ఆయన ఆత్మ పరిశీలన చేసుకోవాలి. అంతేకాదు.. తన వైఖరిని మార్చుకుని ప్రజలకోసం పార్లమెంట్ అన్నది గుర్తించాలి. రాజకీయంగా ఎన్ని విభేదాలు ఉన్నా, పార్లమెంటులో చర్చ లు జరగాలి. అర్థవంతమైన చర్చలకు ఆస్కారం ఉండాలి. స్పీకర్ అలాంటి అవకాశం కల్పించాలి. గతం లో పనిచేసిన స్పీకర్లు అనుసరించిన తీరును నడవాలి. అప్పుడే పార్లమెంట్ సమావేశాలకు అర్థం ఉంటుంది. అధికార బిజెపి డా ప్రజాస్వామ్యబద్దంగా పనిచేయడానికి సిద్దంగా ఉండాలి. గత పదేళ్లతో పోలిస్తే 2024 ఎన్నికల్లో బిజెపి బలం గణనీయంగా పడిపో యింది. ఇప్పుడు ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో కొనసాగుతున్నామని గుర్తించాలి. ఇంకా మభ్య పెట్టే పనులతో ప్రజల్లో మరింత పలచన కాకుండా చూసుకుంటే మంచిది. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ప్రధాని సభకు రావడం మర్యాద. విపక్షాలకు కూడా ఆయన సూచనలు చేయవచ్చు. కానీ మంత్రులతోనే పనికానిచ్చేద్దాఆమంటే సరికాదు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. దీనిని గుర్తించకుంటే ప్రజలు తగిన సమయంలో స్పందిస్తారు.

గత పదేళ్లతో పోలిస్తే 2024 ఎన్నికల్లో బిజెపి బలం గణనీయంగా పడిపోయింది. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ప్రధాని సభకు రావడం మర్యాద. విపక్షాలకు కూడా ఆయన సూచనలు చేయవచ్చు. కానీ మంత్రులతోనే పనికానిచ్చేద్దాఆమంటే సరికాదు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. దీనిని గుర్తించకుంటే ప్రజలు తగిన సమయంలో స్పందిస్తారు.

EDITORIAL

# పేదల సంక్షేమం.. గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- 32 నెలల్లో ఏదులాపురం మున్సిపాలిటీలో రూ.21.61 కోట్ల అభివృద్ధి పనులు
- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు
- రైతుల సంక్షేమానికి రూ.21 వేల కోట్ల రుణమాఫీ: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రజానావ, ఖమ్మం:** పేదల సంక్షేమంతో పాటు గ్రామాలు, కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ఏదులాపురం మున్సిపా లిటీ, ఖమ్మం రూరల్ మండలంలో జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌లతో కలిసి మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. గుదిమల్లలో ఖమ్మం రూరల్ మండలం ప్రకాష్ నగర్ బ్రిడ్జి నుంచి గుదిమల్ల వరకు రూ.5 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులకు, కామంచికల్ గ్రామం నుంచి కోయచిలక వరకు రూ.2.10 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత 32 నెలల్లో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 8, 10, 11, 12 డివిజన్లలో రూ.21.61 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గత ప్రభుత్వం గ్రామాలు, కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ, పేదల సంక్షేమ పథకాల అమలులో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. గత పదేళ్లలో పేదలకు ఇళ్లు అందించడంలో నిర్లక్ష్యం జరిగిందని, తమ ప్రభుత్వం కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబా నికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తోందన్నారు. తొలి విడతలో 4.5 లక్షలు, రెండో విడతలో 2.5 లక్షలు, హైదరాబాద్‌కు మరో లక్ష కలిపి మొత్తం 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. మూడో, నాలుగో విడతల్లో మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, రైతు భరోసా కింద ఎకరానికి రూ.6 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌తో పాటు మద్దతు ధర కూడా అందిస్తున్నామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి కొత్తగా వృద్ధాప్య, వితంతు పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పేదల కష్టాలు తెలిసిన ప్రభుత్వమిదని, భవిష్యత్తులో కూడా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ గ్రామానికి మరో రెండు రహదారులను మంజూరు చేస్తామని, మరో రెండు మూడు రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ చేపడతామని తెలిపారు. నిజమైన అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కామంచికల్ నుంచి కోయచిలక వరకు రూ.2.10 కోట్లతో 1.6 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. గత 32 నెలల్లో కామంచికల్ గ్రామ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5.66 కోట్ల నిధులు మంజూరు చేసి పలు అభివృద్ధి పనులు చేపట్టిందని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర్ మాట్లాడుతూ ఏదులాపురంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ప్రతి పనిని నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కామంచికల్ గ్రామంలో గతంలో రహదారి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం మెరుగైన రోడ్డు సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మంత్రి ఆదేశాల మేరకు శంకుస్థాపన చేసిన పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో గా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత మాట్లాడుతూ గత 25 సంవత్సరాల్లో జరగని రహదారి అభివృద్ధి పనులు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చొరవతో జరుగుతున్నాయని తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.75 కోట్లు మంజూరు చేశారని, ప్రతి వార్డును అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీనివాస్, సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న సినీ నటుడు శ్రీకాంత్

వేదాశీర్వచనం అందించిన ఆలయ పండితులు

**ప్రజానావ, యాదగిరిగుట్ట:** ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్ గురువారం సాయంత్రం యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. బ్రేక్ దర్శన సమయంలో ఆలయానికి చేరుకున్న ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ వేద పండితులు శ్రీకాంత్‌కు వేదాశీర్వచనం అందించారు. ఆలయ ఈఓ భవానీ శంకర్ స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు.

# జయశంకర్ ఆశయాలే తెలంగాణకు మార్గదర్శకం

- నీళ్లు, నిధులు, నియామకాల కోసం జీవితాంతం పోరాటం
- ప్రతి ఉద్యోగి బాధ్యతతో ప్రజలకు సేవ చేయాలి: కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



**ప్రజానావ, సూర్యాపేట:** తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్తగా, ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు తెలంగాణ ప్రజలకే దక్కాలనే లక్ష్యం తో ఆయన జీవితాంతం ఉద్యమించారని కొనియా డారు. ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి సంద ర్భంగా గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్‌తో కలిసి కలెక్టర్ పాల్గొని జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్యాయాలను ఎదుర్కొనేందుకు పోరాటాలు, సాహిత్యం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన మహనీయుడు జయ శంకర్ అని అన్నారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన వారికి ఉద్యోగ అవకాశాలు లభిస్తే ప్రాంతంతో పాటు దేశం కూడా అభివృద్ధి చెందుతుందని ఆయన విశ్వసించారని తెలిపారు. తెలంగాణ వనరులు తెలంగాణ ప్రజలకే దక్కాలనే లక్ష్యంతో ఉద్యమాన్ని సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా వివరించి, వారిని ఏకతాటిపైకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఉద్యోగి తన విధులను బాధ్యతగా నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేయాలని సూచించారు. జిల్లాలో అభివృద్ధి పనులు, విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా సమిష్టి బాధ్యతతో పనిచేయాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ మాట్లాడుతూ మలి దశ తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ కీలక పాత్ర పోషించారని, తెలంగాణ వనరులు ఈ ప్రాంత ప్రజలకే ఉపయోగపడాలని ఆకాంక్షించారని తెలిపారు. ఆయన సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ప్రేమ్‌రాజ్, సీపీఓ కిషన్, డీఎంఅండ్‌హెచ్ఓ వెంకట రమణ, డీపీఓ యాదగిరి, డీడబ్ల్యూఓ నరసింహారావు, డీటీఓ రవికుమార్, ఇన్‌చార్జి పరిపాలన అధికారి శ్రీలత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితిపై హరీష్‌రావు ఆగ్రహం

- ఆరోగ్యశ్రీ నిధులు రెండేళ్లుగా విడుదల కాలేదు
- ఎంఆర్ఐ సేవలు వెంటనే ప్రారంభించాలి..
- 62 వైద్యుల పోస్టులు భర్తీ చేయాలి
- రోగులు బయట మందులు, కుట్ల దారం కొనడం దురదృష్టకరం

**ప్రజానావ, సిద్దిపేట:** సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య సేవలు పూర్తిగా దిగజారిపోయాయని, రెండేళ్లుగా ఆరోగ్యశ్రీ నిధులు విడుదల కాకపోవడం దారుణమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి డెవలప్‌మెంట్ సొసైటీ కమిటీ సమావేశంలో ఆసుపత్రి పనితీరుపై అధికారులను ఆయన నిలదీశారు. ఒకప్పుడు సిద్దిపేటతో పాటు నాలుగు జిల్లాల ప్రజలకు నమ్మకమైన వైద్య కేంద్రంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి ప్రస్తుతం దయనీయ పరిస్థితికి చేరుకుందని అన్నారు. గత రెండేళ్లుగా ప్రజలు వైద్య సేవల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వ హణ అధ్వానంగా ఉందని, బయో మెడికల్ వ్యర్థాలు పేరుకుపోవడం, దోమలు, ఈగలు, కుక్కల సంచారం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రోగుల బంధువులకు స్నానాలు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేకపోవడం సరికాదన్నారు. ఇన్‌పేషెం ట్లకు సమయానికి ఆహారం అందడం లేదని, రాత్రి ఇవ్వాల్సిన భోజనాన్ని సాయంత్రానికే అందిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రిపై తిరిగి నమ్మకం కలిగేలా వైద్య సేవలను మెరుగుపరచాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేసి అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని హరీష్‌రావు అధికారులకు సూచించారు.

# గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

- కారు బోల్తా.. తల్లి, కుమారుడు మృతి
- మరొకరి పరిస్థితి విషమం





**ప్రజానావ, ఖమ్మం:** ఖమ్మం–దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. దంసలాపురం మున్నేరు వంతెన సమీపంలో గురువారం జరిగిన ప్రమాదంలో తల్లి, కుమారుడు దుర్మరణం చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయప డ్డారు. వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొని బోల్తా పడింది. ప్రమాద తీవ్రతకు కారులో ప్రయాణిస్తున్న తల్లి, కుమారుడు అక్కడికక్కడే మృతి చెందారు. కారు నడుపుతున్న వ్యక్తి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతులను ఖమ్మం జిల్లా చింతకాని మండలం గాంధీనగర్‌కు చెందిన పాపబ త్తిని సుజాత (40), ఆమె కుమారుడు పాపబత్తిని పవన్ కుమార్ (18)గా పోలీసులు గుర్తించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పాపబత్తిని నరసింహారావును స్థానికులు, పోలీసులు వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందడం, మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొం దుతుండటంతో గాంధీనగర్ గ్రామంలో విషాదఛాయ లు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# సిద్దిపేట జీజీహెచ్‌కు రూ.5.49 కోట్ల వైద్య పరికరాలు

- హెచ్‌డీసీ ఆమోదం.. వైద్య సేవలు మెరుగుపర్చాలని మంత్రి పొన్నం, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదేశాలు
- సూపరింటెండెంట్, అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి



**ప్రజానావ, సిద్దిపేట:** సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో అత్యాధునిక వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు రూ.5.49 కోట్ల వ్యయంతో వైద్య పరికరాల కొనుగోలుకు హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ (హెచ్‌డీసీ) ఆమోదం తెలిపింది. జిల్లా కలెక్టర్ కె. హైమా వతి అధ్యక్షతన గురువారం నిర్వహించిన హెచ్‌డీసీ సమా వేశానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కూడా పాల్గొన్నారు. సమావే శంలో ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది వివరాలను సమగ్రంగా అందించడంలో విఫలమైన జీజీహెచ్ సూపరింటెండెంట్‌తో పాటు సంబంధిత అధికారులపై మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు, కలెక్టర్ కె. హైమావతి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, మానవ వనరులపై స్పష్టమైన సమాచారం లేకపోవడం సరికాదని హెచ్చరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య సదుపాయాలు ఉన్నప్పటికీ అవి ప్రజలకు ఆశించిన స్థాయి లో అందడం లేదని పేర్కొన్నారు. వైద్యులు, అధికారులు సమన్వయంతో పనిచేసి సేవలను మరింత మెరుగుప ర్చాలని సూచించారు. ఆస్పత్రి, నర్సింగ్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను వెంటనే సిద్ధం చేసి భర్తీ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. ఆస్పత్రి అభివృద్ధికి అవసరమైన అదనపు నిధుల కోసం సమగ్ర నివేదికను ప్రభుత్వానికి, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి సమర్పించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రభుత్వ ఆస్పత్రిలో అందిస్తున్న ప్యాలియేటివ్ కేర్ సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. పీజీ వైద్య విద్యార్థుల సహకారంతో ఆర్‌బీఎస్‌కే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిం చి ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయాలని సూచించారు. కంటి, వినికిడి సమస్యలు ఉన్న చిన్నారులను గుర్తించి సకాలంలో చికిత్స అందించాలని, జిల్లాలోని 56 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్య పరీక్షలను మరింత విస్తృతం చేయాలని పేర్కొ న్నారు. అనవసరంగా సీ–సెక్షన్ ప్రసవా లు నిర్వహించే ప్రైవేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకో వాలని, దీనిపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని సూచించారు. ఆస్పత్రిలో రోగులకు అందించే ఆహారం నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే అన్ని రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా లేని అత్యాధునిక పరికరాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్నాయని ప్రజలకు తెలియజేయాలని మంత్రి సూచించారు. ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు రిఫర్ చేసే రోగులను తప్పనిసరిగా ప్రభుత్వ అంబులెన్స్‌ల ద్వారానే తరలించాలని ఆదేశిం చారు. ఆస్పత్రిలో తాగునీటి సమస్యలు లేకుండా చూడడంతో పాటు చిన్నపాటి మరమ్మతులను వెంటనే పూర్తి చేయా లని, అత్యవసర విభాగాల్లో సీనియర్ వైద్యులు అందుబా టులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ సిద్దిపేట జనరల్ ఆస్పత్రి ద్వారా జిల్లా ప్రజలకు సత్వర, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమన్నారు. ఆస్పత్రికి అవసర మైన పలు ఆధునిక వైద్య పరికరాలు ఇప్పటికే అందిం చామని తెలిపారు. ప్యాలియేటివ్ కేర్, పీడియాట్రిక్ కేర్, కీమో థెరపీ, అంబులెన్స్ సేవలు, ఇన్‌పేషెంట్ రోగులకు అందిం చే ఆహారం, ఎంఆర్ఐ, సీటీ స్కాన్, ఇతర నిర్ధారణ సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. డీ–అడిక్షన్ సెంటర్ సేవలను బలోపేతం చేయడంతో పాటు ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం ద్వారా కంటి, వినికిడి లోపాలు ఉన్న పిల్లలను గుర్తించి చికిత్స అందించా లని సూచించారు. క్యాన్సర్ రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో కీమోథెరపీ సేవలు అందుబాటులో ఉన్న విష యాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశానికి ముందు తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన చిత్రపటానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీ కిరణ్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంగీత షా, డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్‌తో పాటు వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.



# జయశంకర్ ఆశయాలు భావి తరాలకు స్ఫూర్తి

**జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన సమయంలో ఉద్యమ స్ఫూర్తిని సమాజంలోని అన్ని వర్గాలకు చేరవేస్తూ, తెలంగాణ ఆకాంక్షను ప్రజల్లో చైతన్యంగా మలచడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. సమాజం పట్ల నిబద్ధతతో అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారని, ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను గురువారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ పార్టీ కార్యాలయాలు, సంస్థలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య ఆధ్వర్యంలో నిర్వహించి జయశంకర్ కు నివాళి అర్పించారు.

# ఆరోగ్యవంతమైన పిల్లలే సమాజానికి పునాదులు

**తల్లిపాల వారోత్సవాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి**



**ప్రజానావ, సిరిసిల్ల :** ఆరోగ్యవంతమైన పిల్లలే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాదులు అని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని 17 వ వార్డులో రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆగస్టు 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలలో భాగంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన తొలి ఆహారం అందులో భాగంగా పుట్టిన వెంటనే తల్లి ఇచ్చే ముర్రు పాలు శిశువు ఆరోగ్యాన్ని కాపాడటంలో, రోగనిరోధక శక్తిని పెంచటంలో ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించే అమృతం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతం కార్యక్రమాన్ని అలాగే చిన్న పిల్లలకు అన్నప్రాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మ రాజ్యం, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ గుండ్లపల్లి నీరజ పూర్ణచందర్, దార్నం అరుణ లక్ష్మీ నారాయణ, బత్తుల రమేష్, సిడిపిఓ ఇతర మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, మహిళలు మరియు చిన్నపిల్లలు పాల్గొన్నారు.

# కేంద్రంలోని భాజపా ప్రజావ్యతిరేక పాలనను ఎండగట్టాలి



**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ, ప్రజలను చైతన్యవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కామ్రేడ్ బాల నరసింహం పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రమైన బిజినపల్లిలో సీపీఐ జాతీయ సమితి పిలుపుమేరకు నిర్వహించిన ప్రచార పాదయాత్రలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అధికారంలోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా నిరుద్యోగం, నిత్యావసరాల ధరల పెరుగుదలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. హామీలను విస్మరించి, ప్రశ్నించే గొంతులను నొక్కేస్తూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తోందని విమర్శించారు. నిరంతరం ప్రజాసమస్యలపై పోరాడుతున్న సీపీఐ, బిజెపి విచ్ఛిన్నకర రాజకీయాలను ప్రజల్లోకి తీసుకెళ్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కె.కేశవులు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఈర్ల చంద్రమౌళి, మండల కార్యదర్శి కృష్ణాజి, కౌన్సిల్ సభ్యులు తన్నీరు మల్లయ్య, మారేడు శివశంకర్, మధు గౌడ్, ప్రేమ్ కుమార్, నాయకులు భూపేష్, నరసింహ, పర్వతాలు, శివకృష్ణ, రామస్వామి, శీను, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జయశంకర్ జయంతి



**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** స్థానిక శ్రీ వివేకానంద విద్యా నికేతన్ పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఉత్సవాలు, స్కూల్ లీడర్ ఎన్నికలు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. పాఠశాల చైర్మన్ జి. శ్యామ్ సుందరాచారి, కరస్పాండెంట్ జి. ప్రియాంక, ప్రిన్సిపల్ వై. మల్లేష్ ముఖ్య అతిథులుగా హాజరై, జయశంకర్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం నిర్వహించిన ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికల్లో ఐదో తరగతి విద్యార్థిని జి. నక్షత్ర 12 ఓట్ల మెజారిటీతో స్కూల్ ఫస్ట్ లీడర్గా, అదే తరగతికి చెందిన గోవర్ధన్ సెకండ్ లీడర్గా ఎన్నికయ్యారు. విజేతలకు యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



# జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

**కలెక్టర్ కె. హరిత**

**ప్రజానావ, ఆసిఫాబాద్:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం ఉద్యమించిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కె. హరిత పిలుపునిచ్చారు. ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మలి దశ తెలంగాణ ఉద్యమంలో ఆచార్య జయశంకర్ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఆయన చూపిన మార్గం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి. అహ్మద్, పీఏసీఎస్ ప్రతినిధి అలీబిన్ అహ్మద్, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, బీసీ సంక్షేమ శాఖ అధికారి నదీమ్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు చేరువయ్యే సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలి

- **దొంగతనం కేసుల ఛేదన, కన్విక్షన్ రేటు పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి**
- **సైబర్ నేరాల నివారణకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి**
- **రాజన్న జోన్- 3 డీఐజీ సన్‌ప్రీత్ సింగ్**



**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పారదర్శక, జవాబుదారీతనం కలిగిన సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని, ప్రతి ఫిర్యాదుపై సత్వర స్పందనతో బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని రాజన్న జోన్–3 డిఐజి సన్ ప్రీత్ సింగ్ అధికారులను ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి విచ్చేసిన రాజన్న జోన్–3 డీఐజీ సన్‌ప్రీత్ సింగ్ కు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించిన డీఐజీ కార్యాలయ పరిసరాలు, స్పెషల్ బ్రాంచ్, ఐటీ కోర్, డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (డీసీఆర్‌బీ) విభాగాలను పరిశీలించి, రికార్డుల నిర్వహణ, డిజిటల్ డేటా నిర్వహణ, సాంకేతిక వినియోగంపై ఆరా తీశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసుల పనితీరు పట్ల రాజన్న జోన్–3 డీఐజీ శ్రీ సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి జిల్లా పోలీసింగ్ వ్యవస్థ, శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ చర్యలు, ప్రజా భద్రత, దర్యాప్తు ప్రమాణాలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, సైబర్ నేరాల నివారణ, పెండింగ్ కేసుల పురోగతి, కమ్యూనిటీ పోలీసింగ్, ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలపై సమగ్రంగా సమీక్షించారు. ముందుగా జిల్లా ఎస్పీ డీఐజీ కి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా జిల్లా భౌగోళిక స్వరూపం, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు చేపడుతున్న చర్యలు, నేర నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, సైబర్ నేరాల నివారణ, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ...నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. జిల్లాలో నమోదవుతున్న దొంగతనం కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించి కేసులను త్వరితగతిన ఛేదించాలని సూచించారు. నమోదైన కేసుల్లో నిందితులకు శిక్షలు పడే శాతాన్ని మరింత పెంచేలా పటిష్ఠమైన దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణపై దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లాలో కన్విక్షన్ రేటు మెరుగ్గా ఉండటం అభినందనీయమని పేర్కొంటూ, అందుకు కృషి చేసిన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అభినందించారు. కోర్టు మానిటరింగ్ బృందం ప్రతి కేసును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, విచారణ సమయంలో సాక్షులు తప్పనిసరిగా కోర్టుకు హాజరయ్యేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో అధికంగా నమోదవుతున్న సైబర్ నేరాలను విశ్లేషించి, వాటిపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే నేను సైతం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సీసీ కెమెరాల ఏర్పాటును విస్తృతంగా ప్రోత్సహించాలని, ప్రతి గ్రామంలో గ్రామ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసి కనీసం 5 నుంచి 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలీసు అధికారి తన పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల పూర్తి వివరాలపై అవగాహన కలిగి ఉండాలని, పెట్రోలింగ్ సమయంలో రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, అనుమానిత వ్యక్తులను తప్పనిసరిగా తనిఖీ చేస్తూ వారి ప్రస్తుత కార్యకలాపాలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్పీ లు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సిఐలు, ఆర్ఐ లు, ఎస్ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

# సిద్దాపూర్ రిజర్వాయర్ పనులు వేగవంతం చేయాలి

- **నాణ్యత ప్రమాణాలతో నిర్మాణం పూర్తి చేయాలి**
- **10 వేల ఎకరాలకు సాగునీటి సమస్యలు పరిష్కారం: ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి**

**ప్రజానావ, వర్ని:** మండలంలోని సిద్దాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న రిజర్వాయర్ పనులను రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాలుగు బండ్లలో భాగంగా చేపట్టిన మొదటి బండ్ నిర్మాణంలో రెండు స్లూయిస్ (తూముల) నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ నిర్మాణాల కారణంగా గతంలో సిద్దాపూర్ చెరువులో నిల్వ అయ్యే నీటి పరిమాణంతో పోలిస్తే ప్రస్తుతం దాదాపు రెట్టింపు స్థాయిలో నీటి నిల్వ సాధ్యమవుతోందన్నారు. కట్ట ఎత్తును సుమారు ఐదు మీటర్లు పెంచడం వల్ల రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. రిజర్వాయర్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే సిద్దాపూర్ పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాల స్థాయి పెరిగే అవకాశం ఉందన్నారు. ఆయకట్టు పరిధిలోని వ్యవసాయ భూములకు వానాకాలం, యాసంగి పంటలకు అవసరమైన నీరు ఇప్పటికే నిల్వ ఉందని, రైతులకు సాగునీటి ఇబ్బందులు ఉండవని వివరించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయిన అనంతరం ఆయకట్టు పరిధిలోని సుమారు 10 వేల ఎకరాలకు సాగునీటి సమస్యలు పూర్తిగా పరిష్కారమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# మండల కాంగ్రెస్‌లో ఎవరి దారి వారిదే!

- **మండల అధ్యక్షుడి ఎంపికతో నాయకుల్లో అసంతృప్తి**
- **ఎవరికివారు తన అనుచర వర్గంతో కార్యక్రమాలు**

**ప్రజానావ, గంభీరావుపేట:** ఎవరి దారి వారిదే అన్న చందంగా ఉంది మండల కాంగ్రెస్ పరిస్థితి. పది ఏళ్ల బిఆర్ఎస్ పాలన అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం లేదు. గంభీరావుపేట మండల కాంగ్రెస్ పార్టీలోని నాయకులు ఎవరి దారి వారిదే అన్నట్లుగా వ్యవహరిస్తుండడం మండలంలోని పార్టీ నాయకులు కార్యకర్తలు ఎటు వెళ్లాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. కలిసికట్టుగా ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేసి, మార్గదర్శకంగా ఉండాల్సిన నాయకులు మండల అధ్యక్షుని ప్రకటనతో మండల కాంగ్రెస్ లో వర్గపోరు కొనసాగుతుంది. పార్టీలోని నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందుకు నిదర్శనంగా ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని ఎగువ మానేరు ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండడంతో బుధవారము డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డిలు తమ అనుమాయులతో గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. అధికారంలో లేనప్పటి నుండి మొదలుకొని పార్టీ అధికారంలోకి వచ్చిన రెండున్నర ఏళ్లుగా కొనసాగుతున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షున్ని తొలగించి పార్టీ అధిష్టానము నూతన అధ్యక్షున్ని నియమించింది. దీంతో పార్టీలోని కొంతమంది నాయకులకు మింగుడు పడటం లేదు. ప్రకటించిన మరుసటి రోజే అధ్యక్షుని ప్రకటనపై కొంతమంది కాంగ్రెస్ నాయకులు మీడియా వేదికగా ధిక్కార స్వరం వినిపించారు. అందుకు సంబంధించి పార్టీ క్రమశిక్షణ చర్యల కింద మండలానికి చెందిన నలుగురు కాంగ్రెస్ నాయకులను జిల్లా కాంగ్రెస్ పార్టీ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. మండల అధ్యక్షుని ప్రకటన అనంతరం కేకే జన్మదినాన్ని కేకే అనుచర వర్గమే వేడుకలు జరుపుకోగా, అనంతరం జరిగిన దివంగత ముఖ్యమంత్రి వైయస్సార్ జయంతి వేడుకలు, ఢిల్లీలో కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టు ఖండిస్తూ మండల కేంద్రంలో చేపట్టిన శాంతియుత నిరసనలో కేకే అనుచర వర్గం ఎవ్వరు పాల్గొనలేదు. కాంగ్రెస్ లో నెలకొన్న అసమ్మతి కుమ్ములాటలు మండలంలోని బిఆర్ఎస్ నాయకులకు కలిసి వచ్చే అవకాశంగా ప్రాంత విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఎల్‌నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలి

**కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**ప్రజానావ ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు కేవలం వర్షాలపైనే ఆధారపడి వరి సాగు చేయకుండా, ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించి, జిల్లాలో పంటల మార్పిడిని విజయవంతం చేయాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను చూసి రైతులు ఆతురుతతో వరి సాగుపైనే ఆధారపడవద్దని స్పష్టం చేశారు. ప్రతి మండల వ్యవసాయ అధికారి క్షేత్రస్థాయిలో పర్యటించి, పంటల మార్పిడి బాధ్యతను స్వీకరిస్తూ రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# సిరిసిల్ల టు సిల్వర్ స్క్రీన్

- **సినీ రంగంలో రాణిస్తున్న విద్యాసాగర్**
- **బలగంతో గుర్తింపు**

**ప్రజానావ, సిరిసిల్ల :** తన లక్ష్యం సినిమాల్లో నటించడం. అందుకోసం తిరగని స్టూడియో లేదు.. ఎక్కిన ఆఫీస్ మెట్లు లేవు. చివరగా వేణు బలగంతో అతని దశ మారింది. సినిమాల్లో నటించే అవకాశం దక్కింది. అతనే సిరిసిల్ల బిడ్డ విద్యాసాగర్. విద్యాసాగర్ సిరిసిల్ల లో పుట్టి పెరిగి గ్రాడ్యుయేషన్ పూర్తిచేశాడు. హైదరాబాద్ లోని ప్రముఖ వి.ఎఫ్.ఎక్స్ కంపెనీ లో జూనియర్ వి.ఎఫ్.ఎక్స్ ఆర్టిస్ట్ గా జాయిన్ అయ్యి అక్కడి నుండి టీం లీడర్ గా అనంతరం సూపర్ వైజర్ ప్రమోట్ అయి తనకంటూ ఒక మంచి స్థాయిని సంపాదించుకున్నాడు. చిన్నప్పటినుండి నటుడు అవ్వాలనే తన కలను సాకారం చేసుకోవాలని ప్రయత్నాలు మొదలు పెట్టాడు. తన కల ముందు ఉద్యోగం కూడా చిన్నది అయ్యింది. తన కలను నెరవేర్చుకోవడం కోసం ఉద్యోగాన్ని వదిలేసి థియేటర్ ఆర్ట్స్ లో చేరి కొన్నాళ్లు నటనలో శిక్షణ తీసుకుంటూ వాలి వధ పరాయి వంటి పలు నాటక ప్రదర్శనలో నటించాడు. ఆ తరువాత షార్ట్ ఫిలిమ్స్, సినిమాల్లో అవకాశాల కోసం ఆఫీస్ ల చుట్టూ తిరుగుతూ జెర్సీ, కొత్త పోరడు లో అవకాశాల్ని అందుకున్నాడు. ఇలా ఒక్కొక్క ప్రయత్నాన్ని, ఒక్కొక్క అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ కొనసాగుతున్న క్రమంలో కరోనా



మహమ్మారి రూపంలో ప్రపంచంతోపాటు విద్యాసాగర్‌నీ కూడా వణికించింది. అలాంటి పరిస్థితుల్లో పనిలేక, భవిష్యత్తు అర్థం కాక ఊరెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సెకండ్ వేవ్ తర్వాత తనకు తాను గట్టి నిర్ణయం తీస్కొని బలమైన నమ్మకంతో తిరిగి హైదరాబాద్‌కు వచ్చి పంచాయతీ, రామన్న యూత్ సినిమాలు చేస్తున్న సినీ ప్రయాణంలో బలగం సినిమా కొరకు దర్శకుడు వేణు యెల్దండి నుండి పిలుపు వచ్చింది. ఆ సినిమా ఆయనకు ఒక బలాన్ని, ఒక బలగాన్ని ఇచ్చింది. ఆ తరువాత వరుసగా భీమదేవరపల్లి బ్రాంచి, సైతాన్ (వెబ్ సిరీస్ ), లగ్గం, సివరపల్లి, కేసీఆర్, కోర్ట్, బద్మాషులు, ఛాంపియన్, వీణ సినిమాలతో వరుసగా తన సినీ ప్రయాణం కొనసాగుతోంది. ఏరలో మారెమ్మ, ఇడుపు కాయితం, పళ్ళ బురుసు, అట్లాస్ సైకిల్ చిత్రాలతో మళ్లీ మన ముందుకు రాబోతున్నాడు.

# తల్లి ముర్రుపాలే శిశువుకు తొలి టీకా

- **మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి**
- **తల్లిపాలతో శిశువుకు రోగనిరోధక శక్తి పెరుగుతుంది: కలెక్టర్ డా. సత్య శారద**

**ప్రజానావ, వరంగల్ :** శిశువు జన్మించిన మొదటి గంటలోపు అందించే ముర్రుపాలే ఆ బిడ్డకు తొలి టీకా వంటిదని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం వరంగల్ సీకేఎం ఆసుపత్రిలో నిర్వహించిన తల్లిపాల అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణీలు, వారి కుటుంబ సభ్యులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముర్రుపాలు శిశువులో సహజ రోగనిరోధక శక్తిని పెంపొందించడంతో పాటు అవసరమైన పోషకాలను అందిస్తాయని తెలిపారు. తల్లిపాలు తాగిన పిల్లల్లో డయేరియా, న్యుమోనియా, కామెర్లు వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు తగ్గుతాయని, మెదడు ఎదుగుదల మెరుగుపడటంతో పాటు తల్లి, బిడ్డల మధ్య అనుబంధం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. తల్లులకు కూడా తల్లిపాల ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. ప్రసవానంతరం రక్తస్రావం తగ్గడం, గర్భాశయం త్వరగా సాధారణ స్థితికి చేరుకోవడం, స్థూలకాయం తగ్గడం, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, టైప్–2 మధుమేహం వచ్చే ప్రమాదం తగ్గడం వంటి ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. శిశువుకు మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం తల్లిపాలతో పాటు వయస్సుకు అనుగుణంగా పరిపూరక ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజారెడ్డి, సీకేఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. లక్ష్మి దేవి, జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి రాజమణి, ప్రోగ్రామ్ అధికారులు డా. ఐ. ప్రకాష్, డా. రాజమౌళి, డా. సజిదా, డా. ఇక్తాదార్ అహ్మద్, డా. అరుణ్ జోషి, ఆర్ఎంఓ డా. సృజన్ బాబు, యూఎఫ్‌డబ్ల్యూసీ వైద్య అధికారి డా. దిలీప్ కుమార్, లెక్చరర్ ఇన్ కమ్యూనికేషన్ (డెమో) అబ్దుల్లా బాబా, డిప్యూటీ డెమో ఎస్. వెంకటేశ్వర్లు, నర్సింగ్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్‌రెడ్డి సంస్మరణ సభ ఏర్పాట్ల పరిశీలన

- **ఏర్పాట్లను సమీక్షించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**
- **బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నాయకులతో సమావేశం**

**ప్రజానావ, నర్సంపేట:** దివంగత నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి దశదిన కర్మ సందర్భంగా నిర్వహించనున్న సంస్మరణ సభ ఏర్పాట్లను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరిశీలించారు. నల్లబెల్లి మండలంలోని పెద్ది సుదర్శన్ రెడ్డి నివాసం వద్ద నిర్వహించనున్న సంతాప సభ ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, ఆరూరి రమేష్, కుడా మాజీ చైర్మన్ మరి యాదవ రెడ్డి, రెడ్‌క్రాస్ మాజీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్ల వివరాలను నాయకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పార్టీ నాయకులతో సమావేశమై సభను విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వనపర్తి వద్దూ.. నాగర్‌కర్నూల్ ముద్దు

**ప్రజానావ ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో :** మా చదువు, బతుకూ నాగర్‌కర్నూల్‌లోనే.. కానీ మమ్మల్ని వనపర్తి జిల్లాలో కలపడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాంమని వనపర్తి జిల్లా రేవల్లి మండలం తల్పునూరు గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాన్ని తిరిగి నాగర్‌కర్నూల్ జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష ఆధ్వర్యంలో గ్రామంలో 52 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. గ్రామానికి వనపర్తి 30 కి.మీ దూరంలో ఉండడమే సరైన బస్సు, ఆటో సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అదే నాగర్ కర్నూల్ అయితే కేవలం 14–15 కి.మీ దూరంలో ఉండడం వల్ల విద్యా, వైద్య అవసరాలతో పాటు రైతులు తమ పంట ఉత్పత్తుల విక్రయాలకు, విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు అక్కడికే వెళ్తున్నారు. గతంలో తమ ఊరు నాగర్‌కర్నూల్ జిల్లాలోనే ఉండేదని, యువత ఉద్యోగ అవకాశాలకు, ప్రజల రోజువారీ




పరిపాలనా సౌలభ్యానికి ఇది ఎంతో అవసరమని పేర్కొంటున్నారు. సరిహద్దుల సాంకేతికతల కంటే ప్రజల మానవీయ కష్టాలను పరిగణనలోకి తీసుకుని, ప్రభుత్వం తక్షణమే స్పందించి తల్పునూరును నాగర్‌కర్నూల్ జిల్లాలో విలీనం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# సర్ ప్రక్రియపై రాజకీయ పార్టీలతో కలెక్టర్ సమీక్ష

**ప్రజానావ, కామారెడ్డి:** జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్–2026) కార్యక్రమంపై గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల జిల్లా నాయకులతో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్–2026 ప్రక్రియను పూర్తి పారదర్శకత, నిష్పాక్షికతతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జుక్కల్, ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటరు జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో కూడా ఆగస్టు 10లోపు డిజిటలైజేషన్ పూర్తి చేస్తామని వెల్లడించారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ఎన్నికల నిబంధనల మేరకు ప్రక్రియ కొనసాగిస్తున్నామని చెప్పారు.




# ప్రజాస్వామ్యంలో నిరసన కూడా సంభాషణే

- విభేదాలు కాదు.. ఏకాభిప్రాయం సాధించడమే ఆందోళనల లక్ష్యం కావాలి
- సోషల్ మీడియాపై స్వీయ క్రమశిక్షణే పరిష్కారం
- ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భగవత్
- విద్యపై జీడీపీలో 6శాతం డిమాండ్‌కు మద్దతు

**ముంబై:** ప్రజాస్వామ్యంలో నిరసన కూడా ఒక చట్టబద్ధమైన సంభాషణ రూపమేనని, అయితే అది విభేదాలను పెంచేందుకు కాకుండా ఏకాభిప్రాయం సాధించేందుకు దోహదపడాలని ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. ముంబైలో ఇండియాస్ ఇంటర్నేషనల్ మూవ్‌మెంట్ టు యునైట్ నేషన్స్ (ఐఐఎంయూఎన్) 15వ వార్షికోత్సవ కార్యక్రమంలో సుమారు 2,000 మంది జనరేషన్–జెడ్, జనరేషన్–ఆల్ఫా యువతను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రజల సమస్యలు సంభాషణ ద్వారా పరిష్కారం కాకపోతే ఆందోళనలకు దిగడం సహజమేనని, అయినప్పటికీ ప్రతి నిరసన అంతిమంగా ఏకాభిప్రాయానికే దారి తీయాలని భగవత్ అన్నారు. దేశ విద్యా వ్యవస్థపై యువత వ్యక్తం చేస్తున్న ఆందోళనలు నిజమైనవేనని, వారి నిజాయితీపై తనకు నమ్మకం ఉందని చెప్పారు. ఏ సమస్యకైనా ముందుగా సంభాషణకే ప్రాధాన్యం ఇవ్వాలని, అది ఫలించనప్పుడు తదుపరి మార్గాలను ఆలోచించాలని సూచించారు.

### నిషేధం పరిష్కారం కాదు

సోషల్ మీడియాను నిషేధించడం పరిష్కారం కాదని, ప్రజల్లో స్వీయ క్రమశిక్షణ పెరగాల్సిన అవసరం ఉందని భగవత్ అన్నారు. సాంకేతికతతో నకిలీ వీడియోలు, స్వరాలు సృష్టించడం సాధ్యమవుతోందని, అందువల్ల సోషల్ మీడియాలో కనిపించే సమాచారాన్ని అధికారిక వనరులతో ధృవీకరించకుండా నమ్మవద్దని సూచించారు. ఎక్కువ మంది అనుచరులు ఉన్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు తమ బాధ్యతను గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు.

### విద్య, ఉపాధిపై అభిప్రాయాలు

విద్యపై జీడీపీలో 6 శాతం వ్యయం చేయాలన్న డిమాండ్‌కు తన మద్దతు ఉంటుందని భగవత్ తెలిపారు. విద్య వ్యాపారం కాకూడదని, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా వ్యవస్థ ఉండాలని అన్నారు. అలాగే ఉపాధి అంటే కేవలం ఉద్యోగాలు మాత్రమే కాదని, వ్యవస్థాపకత (ఎంటర్‌ప్రెన్యూర్ షిప్) కూడా ఉపాధిలో భాగమేనని ఆయన పేర్కొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో అతిక్ అహ్మద్ చిన్న కుమారుడి మృతి

- జాన్సీలో డివైడర్‌ను ఢీకొట్టిన ఎస్‌యూవీ
- స్నేహితుడు దుర్మరణం, మరో ముగ్గురికి గాయాలు
- జైలులో ఉన్న సోదరులను కలిసేందుకు వెళ్తుండగా ఘటన

**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లోని జాన్సీ జిల్లాలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హత్యకు గురైన మాజీ గ్యాంగ్‌స్టర్, రాజకీయ నాయకుడు అతిక్ అహ్మద్ చిన్న కుమారుడు అబాన్ అహ్మద్ మృతి చెందాడు. అతనితో పాటు ప్రయాణిస్తున్న స్నేహితుడు సోనూ కూడా ఘటనలో ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల వివరాల ప్రకారం, ఉదయం సుమారు 10.30 గంటల సమయంలో వేగంగా వెళ్తున్న ఎస్‌యూవీపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో వాహనం రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అబాన్, సోనూ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అబాన్ అహ్మద్ ప్రయాగ్‌రాజ్‌కు చెందినవాడని, జాన్సీ జైలులో ఉన్న తన ఇద్దరు సోదరులను కలిసేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# 13వ రోజుకు చేరిన జార్ఖండ్ విద్యార్థుల ఉద్యమం

- నిరాహార దీక్షలో ఆరుగురు.. చర్చలకు 11మందితో కమిటీ ఏర్పాటు
- జేపీఎస్సీ పరీక్ష రద్దు, సీబీఐ దర్యాప్తు కోరుతూ డిమాండ్



**రాంచీ:** జార్ఖండ్‌లో నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ విద్యార్థులు, ఉద్యోగార్థులు చేపట్టిన ఆందోళన గురువారానికి 13వ రోజుకు చేరుకుంది. ఆరుగురు నిరాహార దీక్ష కొనసాగిస్తుండగా, ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు 11 మంది సభ్యులతో కూడిన ప్రతినిధి బృందాన్ని ఆందోళనకారులు ఏర్పాటు చేశారు. అయితే రాత్రి వరకు ప్రభుత్వం నుంచి చర్చలకు అధికారిక ఆహ్వానం రాలేదని విద్యార్థి నాయకులు తెలిపారు. 14వ జేపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షను రద్దు చేసి, అక్రమాలపై సీబీఐ లేదా రాష్ట్రం వెలుపల హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో స్వతంత్ర దర్యాప్తు జరపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే జేపీఎస్సీ, జేఎస్ఎస్‌సీల్లో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని కోరుతున్నారు. ఉద్యమం అసెంబ్లీలోనూ ప్రతిధ్వనించింది. వర్షాకాల సమావేశాల తొలి రోజున ప్రతిపక్ష ఎమ్మెల్యేలు సీబీఐ విచారణ కోరుతూ నిరసన తెలిపారు. మరోవైపు ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రభుత్వం చర్చలకు సిద్ధమని ప్రకటించగా, విద్యార్థులు సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే ఐదో రోజుగా నిరాహార దీక్ష చేస్తున్న జేఎల్‌కేఎం నేత దేవేంద్రనాథ్ మహతో ఆరోగ్యం క్షీణించగా, సమస్యను త్వరగా పరిష్కరించాలని సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ ప్రభుత్వాన్ని కోరారు. ఆగస్టు 7, 10 తేదీల్లో అసెంబ్లీ ముట్టడికి విద్యార్థి సంఘాలు పిలుపునివ్వడంతో అసెంబ్లీ పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు చేశారు. మరోవైపు నియామక అక్రమాల కేసులో సీఐడీ దర్యాప్తు కొనసాగుతుండగా ఇప్పటివరకు 19 మందిని అరెస్టు చేశారు.

## జార్ఖండ్ విద్యార్థులకు రాహుల్ భరోసా

జార్ఖండ్‌లో నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఆందోళన చేస్తున్న విద్యార్థులకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అండగా నిలిచారని విద్యార్థి నాయకుడు రవీంద్ర పస్వాన్ తెలిపారు. గురువారం సాయంత్రం ఫోన్‌లో మాట్లాడిన రాహుల్, విద్యార్థుల డిమాండ్ల వివరాలు పంపాలని, వాటిపై రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి తనవంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. జేపీఎస్సీ 14వ సివిల్ సర్వీసెస్ పరీక్షను రద్దు చేయడం, నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలపై సీబీఐ లేదా రాష్ట్రం వెలుపల హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో స్వతంత్ర దర్యాప్తు జరపడం, జేపీఎస్సీ–జేఎస్ఎస్‌సీల్లో సమగ్ర సంస్కరణలు చేపట్టడం విద్యార్థుల ప్రధాన డిమాండ్లు. ఈ ఉద్యమం 13వ రోజుకు చేరుకోగా, ఆరుగురు విద్యార్థులు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. పస్వాన్ మాట్లాడుతూ, కాంగ్రెస్ అధికార కూటమిలో భాగస్వామిగా ఉన్నందున విద్యార్థుల సమస్యలపై స్పష్టమైన వైఖరి తీసుకోవాలని రాహుల్‌ను కోరినట్లు తెలిపారు. విద్యార్థుల డిమాండ్లను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ఒప్పించలేకపోతే నైతిక బాధ్యతగా కూటమి నుంచి వైదొలగాలని కూడా సూచించినట్లు వెల్లడించారు.

### రాజకీయ లబ్ధి కోసమే

రాహుల్ గాంధీ ఫోన్ సంభాషణపై బీజేపీ ప్రతినిధి ప్రతుల్ షహదేవ్ స్పందిస్తూ, ఇది కేవలం రాజకీయ లబ్ధి కోసం చేసిన ప్రయత్నమేనని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మంత్రులు ఉన్నప్పటికీ ఒక్కరూ నిరసన శిబిరాన్ని సందర్శించలేదని, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి కూడా ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి విద్యార్థులను కలవలేదని ఆరోపించారు. ఇదిలా ఉండగా, ప్రతిష్ఠంభనకు పరిష్కారం కోసం ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు విద్యార్థులు 11మంది సభ్యులతో కూడిన ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేశారు.

# ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లును ఉపసంహరించండి

### డీఎంకే ఎంపీ విల్సన్ నేతృత్వంలో కేంద్ర హోం మంత్రితో భేటీ

**న్యూఢిల్లీ:** ప్రతిపాదిత విదేశీ విరాళాల నియంత్రణ (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ బిల్లు–2026ను ఉపసంహరించుకోవాలని లేదా సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపాలని డీఎంకే రాజ్యసభ సభ్యుడు పి. విల్సన్ నేతృత్వంలోని క్రైస్తవ మత పెద్దల బృందం కేంద్ర హోంమంత్రి అమిత్ షాను గురువారం కోరింది. ఆర్చ్‌బిషప్ అనిల్ కౌటో, సీఎస్ఐ మోడరేటర్ కె. రూబెన్ మార్క్, ప్రముఖ మత బోధకుడు పాల్ దినకరన్, కాథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఇండియా, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ ఇన్ ఇండియా తదితర సంస్థల ప్రతినిధులు ఈ బృందంలో పాల్గొన్నారు. విదేశీ విరాళాల నియంత్రణను తాము వ్యతిరేకించడం లేదని, అయితే ప్రతిపాదిత బిల్లు నియంత్రణను మించి సేవా సంస్థల ఆస్తులను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునేలా ఉందని వారు తమ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ చట్టం అమల్లోకి వస్తే పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలు వంటి సేవా సంస్థలు తీవ్రంగా ప్రభావితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్తుల స్వాధీనం సరికాదు

# భారత చట్టాలను పాటిస్తున్నారా?

- మెటాపై కేంద్రం ప్రశ్నల వర్షం
- ఆల్గోరిథమ్‌లు, నియంత్రణ వ్యవస్థపై ఆరా
- మోదీ ఫేస్‌బుక్ పోస్ట్ తాత్కాలికంగా తొలగించిన ఘటనపై విచారణ
- మెటా గ్లోబల్ బృందంతో ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ భేటీ





**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ పోస్టును ఇటీవల తాత్కాలికంగా పరిమితం చేసిన ఘటనపై మెటాకు సమన్లు జారీ చేసిన నేపథ్యంలో, భారత చట్టాలను సంస్థ పాటిస్తోందా అనే అంశంపై కేంద్ర ప్రభుత్వం మెటా గ్లోబల్ బృందాన్ని ప్రశ్నిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ అంశాలపై ప్రస్తుతం ప్రభుత్వం, మెటా ప్రతినిధుల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. మెటా ఆల్గోరిథమ్‌లు ఎలా పనిచేస్తున్నాయి? రాజ్యాంగ, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా సంస్థ అమలు చేస్తున్న నియంత్రణ వ్యవస్థలో తగిన భద్రతా చర్యలు ఉన్నాయా? వంటి అంశాలపై కూడా కేంద్రం వివరణ కోరుతోంది. కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ గురువారం మెటా గ్లోబల్ బృందంతో సమావేశమయ్యారు. అనంతరం సాంకేతిక బృందాలతో చర్చలు కొనసాగనున్నట్లు సమాచారం.

### క్షమాపణ చెప్పిన మెటా

ప్రధాని మోదీ ఫేస్‌బుక్ పోస్టు తాత్కాలికంగా తొలగించిన పొరపాటుతో పాటు, చిన్నారులపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్, డీప్‌ఫేక్‌లు, డబ్బు తీసుకుని కొన్ని పోస్టులకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి అంశాలపై మెటా ఇప్పటికే క్షమాపణలు తెలిపినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అమెరికా నుంచి భారత్‌కు వచ్చిన మెటా గ్లోబల్ అఫైర్స్ విభాగాధిపతి జోయెల్ కాప్లాన్ మంత్రి వైష్ణవ్‌కు లిఖితపూర్వకంగా క్షమాపణలు తెలియజేయగా, సంస్థ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ తరఫున కూడా క్షమాపణలు వచ్చినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

# 20న బంగ్లాదేశ్ రాష్ట్రపతి ఎన్నిక

- అధ్యక్ష ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన ఈసీ
- 13న నామినేషన్లు.. 20న పార్లమెంట్‌లో ఓటింగ్
- షహబుద్దీన్ రాజీనామాతో అనివార్యమైన ఎన్నిక

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో కొత్త రాష్ట్రపతి ఎన్నికను ఆగస్టు 20న నిర్వహించనున్నట్లు ఆ దేశ ఎన్నికల కమిషన్ గురువారం ప్రకటించింది. ఆరోగ్య కారణాలతో రాష్ట్రపతి మహ్మద్ షహబుద్దీన్ ఇటీవల పదవికి రాజీనామా చేయడంతో కొత్త రాష్ట్రపతిని ఎన్నుకునే ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల కమిషన్ సీనియర్ కార్యదర్శి అక్తర్ అహ్మద్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఆగస్టు 13న నామినేషన్లు స్వీకరిస్తారు. 16న వాటి పరిశీలన జరగనుండగా, 18వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. ఆగస్టు 20న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ పార్లమెంట్ సమావేశ మందిరంలో ఎన్నిక నిర్వహిస్తారు.

## బీఎన్‌పీకి స్పష్టమైన మెజారిటీ

2023 ఏప్రిల్‌లో ఐదేళ్ల పదవీకాలానికి ప్రమాణ స్వీకారం చేసిన షహబుద్దీన్ ఆరోగ్య సమస్యల కారణంగా రాజీనామా చేశారు. అయితే, ఈ నిర్ణయం వెనుక రాజకీయ కారణాలు కూడా ఉన్నాయన్న ఊహాగానాలు వెలువడ్డాయి. ప్రస్తుతం 350 మంది సభ్యులున్న పార్లమెం ట్‌లో రెండొంతుల మెజారిటీ కలిగిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఇప్పటివరకు రాష్ట్రపతి అభ్యర్థిని ప్రకటించ లేదు. ఒక వ్యక్తి గరిష్ఠంగా రెండు పర్యాయాలు రాష్ట్రపతిగా కొనసాగవచ్చని రాజ్యాంగం పేర్కొంటోంది.

### పార్లమెంట్ సభ్యులే ఓటర్లు

బంగ్లాదేశ్ రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతిని పార్లమెంట్ సభ్యులే ఎన్నుకుంటారు. ఒకే అభ్యర్థిపై ఏకాభిప్రాయం కుదిరితే పోలింగ్ అవసరం ఉండదు. ప్రస్తుతం రాజ్యాంగ నిబంధనల ప్రకారం పార్లమెంట్ స్పీకర్ తాత్కాలిక రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 90 రోజుల్లోపు కొత్త రాష్ట్రపతిని ఎన్నుకోవాల్సి ఉంది.

# కాంగోలో ఎబోలా కలకలం

- వేగంగా విస్తరిస్తున్న మహమ్మారి
- పడవలో 200 మందికి క్వారంటైన్
- ఓ ప్రయాణికుడి మృతి.. తోటి ప్రయాణికులందరికీ పరీక్షలు
- ఇప్పటివరకు 4వేల కేసులు, 1,800కుపైగా మరణాలు



**బునియా:** కాంగోలో ఎబోలా మహమ్మారి మరింత ఆందోళన కలిగిస్తోంది. కాంగో నదిలో దాదాపు మూడు వారాలుగా ప్రయాణిస్తున్న ఓ పడవలో ఎబోలా లక్షణాలతో ఒక ప్రయాణికుడు మరణించడంతో అందులోని సుమారు 200 మంది ప్రయాణికులను అధికారులు క్వారంటైన్‌లో ఉంచి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. బాధితుడు మోంగాలా ప్రావిన్స్‌లో అనారోగ్యానికి గురైన తర్వాత మరణించినట్లు అధికారులు తెలిపారు. రాజధాని కిన్షాసాలో ఇప్పటివరకు ఎబోలా కేసులు నమోదు కాలేదని స్పష్టం చేశారు. ఆఫ్రికా సీడీసీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జీన్ కసేయా వెల్లడించిన వివరాల ప్రకారం, మే నెల నుంచి కొనసాగుతున్న ఎబోలా వ్యాప్తిలో ఇప్పటివరకు 4 వేలకుపైగా కేసులు నమోదవగా, 1,800 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. కొత్త కేసుల్లో 60–70 శాతం మంది ముందుగా గుర్తించిన కాంటాక్టుల జాబితాలో లేని వారే కావడంతో వైరస్ వేగంగా విస్తరిస్తోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఆరోగ్య సిబ్బంది నిరసనలు

ఎబోలా ప్రభావం అత్యధికంగా ఉన్న ఇటూరి ప్రావిన్స్‌లో జీతాలు, భత్యాలు చెల్లించలేదని ఆరోపిస్తూ వైద్య సిబ్బంది సమ్మెకు దిగారు. దీంతో పలు ఆరోగ్య కేంద్రాల్లో సేవలు దెబ్బతిన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనామ్ గెబ్రియేసస్ స్పందిస్తూ, మహమ్మారిని అరికట్టేందుకు ముందువరుసలో పనిచేస్తున్న సిబ్బందికి తగిన సహాయం, రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం దేశంలో 674 మంది రోగులు ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారు.

# హర్మూజ్ ఒప్పందంపై పాక్ ఆశలు

- అమెరికా–ఇరాన్ చర్చలు పునఃప్రారంభమవుతాయని వ్యాఖ్య
- ఒమాన్ మధ్యవర్తిత్వాన్ని ప్రశంసించిన ఇస్లామాబాద్
- పీవోకే ఎన్నికలపై భారత్ వ్యాఖ్యలను ఖండించిన పాక్



**ఇస్లామాబాద్:** హర్మూజ్ జలసంధిపై ఒప్పందం కుదిరితే అమెరికా–ఇరాన్ మధ్య సాంకేతిక స్థాయి చర్చలు తిరిగి ప్రారంభమవుతాయని పాకిస్థాన్ ఆశాభావం వ్యక్తం చేసింది. పశ్చిమాసియా సంక్షోభానికి సమగ్ర, న్యాయబద్ధమైన, శాశ్వత పరిష్కారం కోసం జరుగుతున్న అన్ని దౌత్య ప్రయత్నాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని పాకిస్థాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి తాహిర్ అంద్రాబీ తెలిపారు. ఇరాన్–ఒమాన్ మధ్య హర్మూజ్ జలసంధి ఒప్పందం తుది దశకు చేరిందన్న ప్రకటన, అలాగే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒప్పందం త్వరలో కుదిరే అవకాశముందని చెప్పిన నేపథ్యంలో పాకిస్థాన్ ఈ స్పందన వెలువరించింది. ఉద్రిక్తతలను తగ్గించడంలో ఒమాన్ పోషిస్తున్న పాత్రను కూడా అంద్రాబీ ప్రశంసించారు.

### పీవోకేపై భారత్ వ్యాఖ్యలను తిరస్కరణ

అదే మీడియా సమావేశంలో పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే) ఎన్నికలను భారత్ ప్రహసనంగా అభివర్ణించడాన్ని పాకిస్థాన్ ఖండించింది. అయితే పీవోకేలో ప్రజా నిరసనలు, పాకిస్థాన్ బలగాల కాల్పులపై భారత విదేశాంగ శాఖ చేసిన విమర్శలను ఇస్లామాబాద్ తిరస్కరించింది. భారత్ మాత్రం జమ్మూకశ్మీర్, లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాల మొత్తం భూభాగం తన అంతర్భాగమేనని, వాటిలో కొంత భాగాన్ని పాకిస్థాన్ అక్రమంగా ఆక్రమించి ఉందనే తన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది.

# విమాన ప్రమాదంలో 16 మందిపై కేసు

- వోఎపాస్ ఎయిర్‌లైన్స్ యజమానితో పాటు ఉద్యోగులపై బ్రెజిల్ ఫెడరల్ పోలీసుల అభియోగాలు
- నిర్లక్ష్యం, సాంకేతిక లోపాలే ప్రమాదానికి కారణమని దర్యాప్తులో వెల్లడి
- తుది అభియోగాలపై త్వరలో నిర్ణయం తీసుకోనున్న ప్రాసిక్యూషన్

**సావో పాలో:** 2024 ఆగస్టు 9న బ్రెజిల్‌లో 62 మంది ప్రాణాలు కోల్పోయిన వోఎపాస్ విమాన ప్రమాదానికి సంబంధించి ఆ సంస్థ యజమాని జోస్ లూయిజ్ ఫెలిసియో ఫిల్హోతో పాటు మొత్తం 16 మంది ప్రస్తుత, మాజీ ఉద్యోగులపై బ్రెజిల్ ఫెడరల్ పోలీసులు అధికారికంగా అభియోగాలు మోపారు. సంస్థ నిర్లక్ష్యం, సాంకేతిక లోపాలను పట్టించుకోకపోవడం, నిర్వహణలో వైఫల్యాలే ప్రమాదానికి కారణమని దర్యాప్తులో తేలినట్లు వెల్లడించారు. ప్రమాదానికి గురైన ఏటీఆర్ 72–500 విమానం డీ–ఐసింగ్ వ్యవస్థలో పలుమార్లు లోపాలు తలెత్తినప్పటికీ వాటిని సరిదిద్దకుండా సేవల్లో కొనసాగించినట్లు విమాన డేటా రికార్డర్లు వెల్లడించాయి. అదే రోజు మూడు విమాన ప్రయాణాల్లో ఈ లోపాలు నమోదైనా, తీవ్రమైన మంచు పరిస్థితుల్లో విమానానికి అనుమతి ఇవ్వడం ఘోర నిర్లక్ష్యమని దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. పరానా రాష్ట్రంలోని కస్కావెల్ నుంచి గ్వరుల్యోస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్తున్న విమానం సావో పాలో సమీపంలోని విన్హెడో ప్రాంతంలో సుమారు 13 వేల అడుగుల ఎత్తు నుంచి కుప్పకూలింది. ఈ ప్రమాదంలో 58 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది మృతి చెందారు. ప్రమాదంపై రెండేళ్లపాటు దర్యాప్తు జరిపిన ఫెడరల్ పోలీసులు తమ నివేదికను విడుదల చేశారు. గత నెల బ్రెజిల్ వైమానిక దళం కూడా తీవ్రమైన మంచు పరిస్థితులు, యాంత్రిక లోపాలు, పైలట్ల దృష్టి మరలడం కలిసి ఈ ప్రమాదానికి దారితీశాయని తేల్చింది.

# తరుణ్ తేజ్‌పాల్‌కు షాక్

**పనాజీ:** తెహెల్కా మాజీ సంపాదకుడు తరుణ్ తేజ్‌పాల్‌ను 2013 లైంగిక దాడి కేసులో బాంబే హైకోర్టు గురువారం దోషిగా తేల్చింది. గోవా బెంచ్‌కు చెందిన న్యాయమూర్తులు జస్టిస్ నీలా గోఖలే, జస్టిస్ అమిత్ జంసందేకర్‌ల ధర్మాసనం ట్రయల్ కోర్టు 2021లో ఇచ్చిన నిర్దోషి తీర్పును రద్దు చేసింది. శిక్షపై నిర్ణయాన్ని మధ్యాహ్నం వెల్లడించనున్నట్లు తెలిపింది. తేజ్‌పాల్‌పై భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) సెక్షన్ 376(2)(ఎఫ్) (విశ్వాసం లేదా అధికార స్థానం దుర్వినియోగం చేసి అత్యాచారం), 354(ఎ) (లైంగిక వేధింపులు), 354(బి) (మహిళపై బలవంతంగా దాడి చేసి దుస్తులు తొలగించే ప్రయత్నం) కింద అభియోగాలు రుజువయ్యాయి. సెక్షన్ 376 ప్రకారం కనీసం 10 ఏళ్ల నుంచి జీవిత ఖైదు వరకు శిక్ష విధించే అవకాశం ఉంది.

### శిక్షపై వాదనలు

తేజ్‌పాల్ తరఫు న్యాయవాది కనీస శిక్ష విధించాలని కోర్టును కోరగా, గోవా ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గరిష్ఠ శిక్ష విధించాలని వాదించారు. మహిళ వద్దు అంటే అది వద్దు అనే బలమైన సందేశం వెళ్లాలి అని కోర్టుకు తెలిపారు. తేజ్‌పాల్ మాత్రం తాను రాజకీయంగా వేధింపులకు గురయ్యానని, ఇద్దరు కుమార్తెల తండ్రినని పేర్కొంటూ కరుణ చూపాలని విజ్ఞప్తి చేశాడు. 2013 నవంబర్‌లో గోవాలో జరిగిన థింక్‌ఫెస్ట్ కార్యక్రమం సందర్భంగా హోటల్ లిఫ్ట్‌లో తనపై లైంగిక దాడి జరిగిందని మాజీ మహిళా సహోద్యోగి చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదైంది. ట్రయల్ కోర్టు ఇచ్చిన నిర్దోషి తీర్పును గోవా ప్రభుత్వం హైకోర్టులో సవాల్ చేయడంతో తాజా తీర్పు వెలువడింది.

# కెనడా నాయకత్వంపై ట్రంప్ విమర్శలు

- కఠిన దశలో వాణిజ్య చర్చలు
- ఇది ఉద్యోగాలు, వ్యాపారాల భవిష్యత్తుకు సంబంధించిన పోరాటం
- కెనడా ప్రధాని మార్క్ కార్నీ



**టొరంటో:** అమెరికా–కెనడా మధ్య వాణిజ్య చర్చలు ప్రస్తుతం అత్యంత కఠిన దశకు చేరాయని కెనడా ప్రధాని మార్క్ కార్నీ తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడా నాయకత్వాన్ని విమర్శిస్తూ, మరిన్ని కెనడా ఉత్పత్తులపై సుంకాలు విధిస్తామని హెచ్చరించిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కెనడా కార్మికులు, వ్యాపారాల ప్రయోజనాలను కాపాడేందుకే ఈ చర్చలు జరుగుతున్నాయని కార్నీ చెప్పారు. ఇది కఠినమైన చర్చ. దీనిని కఠిన పోరాటం అనవచ్చు. కానీ ఇది కెనడా ఉద్యోగాలు, వ్యాపారాల భవిష్యత్తుకు సంబంధించిన విషయం అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇరు దేశాల ప్రతినిధులు వాషింగ్టన్‌లో చర్చలు కొనసాగిస్తున్నారని, త్వరలో ట్రంప్‌తో మరోసారి మాట్లాడనున్నట్లు తెలిపారు.

### సుంకాల హెచ్చరిక

లాస్‌వెగాస్‌లో జరిగిన సభలో ట్రంప్ మాట్లాడుతూ, "కెనడా నాయకత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. ప్రజలను నేను ప్రేమిస్తాను, కానీ నాయకత్వం మాత్రం అలాంటిది అని వ్యాఖ్యానించారు. ఇప్పటికే కెనడా ఉక్కు, అల్యూమినియం, ఆటోమొబైల్ ఉత్పత్తులపై అమెరికా సుంకాలు విధించగా, ఆగస్టు 19 నుంచి మరిన్ని కెనడా వస్తువులపై 50 శాతం సుంకాలు విధించే యోచనలో ఉన్నట్లు ప్రకటించారు. అమెరికా విధించిన సుంకాల వల్ల అక్కడ అల్యూమినియం ధరలు 58 శాతం పెరిగాయని కార్నీ తెలిపారు. ఇది అమెరికా పరిశ్రమలకూ అనుకూలం కాదన్నారు. కెనడా అమెరికాకు అతిపెద్ద వాణిజ్య భాగస్వాముల్లో ఒకటి కావడంతో, కొత్త సుంకాలు అమల్లోకి వస్తే రెండు దేశాల వాణిజ్యంతో పాటు వినియోగదారులపై కూడా అదనపు భారం పడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# టీమిండియాకు స్పిన్ పరీక్ష!

- స్వదేశంలో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాతో టెస్టుల్లో తడబడ్డ బ్యాటర్లు
- ఆటగాళ్లు ఎక్కువసేపు క్రీజులో నిలిచేలా ప్రణాళికలు
- బుమ్రా స్థానాన్ని భర్తీ చేసే బౌలర్లపై జట్టు యాజమాన్యం దృష్టి
- నేటి నుంచి ఎస్ఎల్‌సీ ఎలెవన్‌తో మూడు రోజుల వార్మప్ మ్యాచ్



**కొలంబో:** శ్రీలంకతో ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే రెండు టెస్టుల సిరీస్‌కు ముందు భారత జట్టు కీలక సన్నాహక పరీక్షకు సిద్ధమైంది. శుక్రవారం నుంచి ఎస్ఎల్‌సీ ఎలెవన్‌తో మూడు రోజుల వార్మప్ మ్యాచ్ ఆడనున్న టీమిండియా, శ్రీలంక పరిస్థితులకు అలవాటు పడడంతో పాటు స్పిన్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఈ మ్యాచ్‌ను వినియోగించుకోవాలని భావిస్తోంది. ఇటీవల స్వదేశంలో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్‌ల్లో స్పిన్‌ను ఎదుర్కోవడంలో భారత బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. శ్రీలంక పిచ్‌లు కూడా స్పిన్నర్లకు అనుకూలంగా ఉండటంతో శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్‌తో పాటు మిగతా బ్యాటర్లంతా ఎక్కువసేపు క్రీజులో నిలిచి మ్యాచ్ పరిస్థితుల్లో స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కొనే నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవడంపై జట్టు యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది.

### పేస్ దళానికి సిరాజ్ నాయకత్వం

మరోవైపు బౌలింగ్ విభాగానికీ ఈ వార్మప్ మ్యాచ్ ఎంతో కీలకంగా మారింది. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా గాయం కారణంగా జట్టుకు దూరమవడంతో మహ్మద్ సిరాజ్ పేస్ దళానికి నాయకత్వం వహించనున్నాడు. ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, మానవ్ సుతార్, సారాంశ్ జైన్‌లు తుది జట్టులో తమ స్థానాన్ని బలపరుచుకునేందుకు ఈ మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇటీవల భారత్–ఏ తరఫున శ్రీలంక–ఏపై ఆకట్టుకున్న బ్రార్, సారాంశ్ జైన్‌లు మరోసారి తమ ప్రతిభను చాటాలని భావిస్తున్నారు. సోనల్ దినుషా సారథ్యంలో బరిలోకి దిగుతున్న ఎస్ఎల్‌సీ ఎలెవన్‌లో లాహిరు కుమార, విశ్వ ఫెర్నాండో వంటి నాణ్యమైన పేసర్లతో పాటు రమేశ్ మెండిస్, ఇసిత విజేసుందర వంటి స్పిన్నర్లు కూడా ఉన్నారు. దీంతో భారత బ్యాటర్లకు ఈ వార్మప్ మ్యాచ్‌లోనే గట్టి పరీక్ష ఎదురుకానుంది. అయితే కొలంబోలో వర్ష సూచనలు ఉన్నందున మ్యాచ్‌కు అంతరాయం కలిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

### అన్నింటికీ సమాధానం ఉంది: గంభీర్

శ్రీలంకతో ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు భారత జట్టు అన్ని విధాలా సిద్ధంగా ఉంటుందని టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశారు. సాధన శిబిరంలో ఆటగాళ్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ప్రత్యర్థి ఎలాంటి పరిస్థితులు సృష్టించినా వాటిని ఎదుర్కొనే సామర్థ్యం జట్టుకు ఉండాలని సూచించారు. ఆగస్టు 15 ఉదయం బ్యాటింగ్‌కు దిగినా, బౌలింగ్ ప్రారంభించినా.. శ్రీలంక ఎలాంటి సవాల్ విసిరినా దానికి మా వద్ద సరైన సమాధానం ఉండాలి. అందుకోసం అప్పటి వరకు ప్రతి ఆటగాడు తన సన్నద్ధతను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలి. ప్రతి విభాగంలో సంపూర్ణంగా సిద్ధంగా ఉండడమే విజయానికి కీలకం అని గంభీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా భారత జట్టులోకి కొత్తగా ఎంపికైన స్పిన్ ఆల్‌రౌండర్ సారాంశ్ జైన్, యువ ఫాస్ట్ బౌలర్ ఆకిబ్ నబీకి ఆయన ప్రత్యేకంగా స్వాగతం పలికారు. దేశవాళీ క్రికెట్‌లో కష్టపడి ఈ అవకాశాన్ని అందుకున్నారని అభినందిస్తూ, జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం గొప్ప గౌరవమని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దేశానికి, కుటుంబానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు.



### 15 నుంచి తొలి టెస్ట్

భారత్–శ్రీలంక తొలి టెస్టు ఆగస్టు 15 నుంచి గాలే వేదికగా ప్రారంభం కానుండగా, రెండో టెస్టు ఆగస్టు 23 నుంచి కొలంబోలో జరుగుతుంది. గత ఏడాది స్వదేశంలో దక్షిణాఫ్రికాతో 0–2 తేడాతో టెస్ట్ సిరీస్‌ను కోల్పోయిన తర్వాత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) కొత్త చక్రంలో భారత్‌కు ఇదే తొలి టెస్ట్ సిరీస్. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా గాయం కారణంగా దూరమవడంతో అతని స్థానంలో ఆకిబ్ నబీకి జట్టులో అవకాశం లభించింది.

## సెప్టెంబర్ 5న భారత్–పాకిస్థాన్ సమరం

- ఆగస్టు 28 నుంచి మహిళల టీ20 ఆసియా కప్
- దుబాయ్‌లో హై ఓల్టేజ్ పోరుకు రంగం సిద్ధం
- ఎనిమిదో టైటిల్‌పై టీమిండియా కన్ను




**దుబాయ్:** మహిళల టీ20 ఆసియా కప్ 2026లో క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్–పాకిస్థాన్ పోరు సెప్టెంబర్ 5న దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) గురువారం టోర్నీ పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 13 వరకు జరిగే ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో మొత్తం ఎనిమిది జట్లు టైటిల్ కోసం పోటీపడనున్నాయి. టోర్నీ ప్రారంభ మ్యాచ్‌లో ఆగస్టు 28న హాంకాంగ్, థాయ్‌లాండ్ జట్లు తలపడనున్నాయి. గ్రూప్–ఏలో భారత్, పాకిస్థాన్, థాయ్‌లాండ్, హాంకాంగ్, చైనా జట్లు ఉండగా.. గ్రూప్–బీలో డిఫెండింగ్ ఛాంపియన్ శ్రీలంకతో పాటు బంగ్లాదేశ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), ఇండోనేషియా జట్లు ఉన్నాయి. ప్రతి గ్రూపులోని జట్లు రౌండ్ రాబిన్ పద్ధతిలో పరస్పరం తలపడతాయి. రెండు గ్రూపుల నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. సెప్టెంబర్ 10, 11 తేదీల్లో సెమీఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించగా, సెప్టెంబర్ 13న ఫైనల్‌తో టోర్నీ ముగియనుంది. మహిళల ఆసియా కప్ చరిత్రలో భారత జట్టే అత్యంత విజయవంతమైన జట్టుగా నిలిచింది. ఇప్పటివరకు ఏడుసార్లు టైటిల్‌ను కైవసం చేసుకున్న టీమిండియా మరోసారి విజేతగా నిలిచి ఎనిమిదో ఆసియా కప్‌ను సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. భారత్–పాకిస్థాన్ మ్యాచ్‌తో పాటు నాకౌట్ దశ పోటీలు కూడా అభిమానుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

## కొరియా మాస్టర్స్‌లో భారత షట్లర్ల జోరు

- క్వార్టర్స్‌లోకి తన్వీ శర్మ, అశ్మితా చాలిహా, రక్షిత శ్రీ

**సియోల్:** కొరియా మాస్టర్స్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువ షట్లర్లు మెరిశారు. మహిళల సింగిల్స్‌లో తన్వీ శర్మ, అశ్మితా చాలిహా, రక్షిత శ్రీ సంతోష్ రామ్‌రాజ్ క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించి భారత ఆశలను సజీవంగా ఉంచారు. తాజాగా తైపీ ఓపెన్ టైటిల్ గెలిచిన మూడో సీడ్ తన్వీ శర్మ ప్రిక్వార్టర్స్‌లో శ్రీయాన్షి వాలిశెట్టిని 21–16, 17–21, 21–13తో ఓడించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 30వ స్థానానికి చేరుకున్న తన్వీ, సెమీస్ బెర్త్ కోసం మరో భారత క్రీడాకారిణి రక్షిత శ్రీతో తలపడనుంది. రక్షిత జపాన్‌కు చెందిన మనామి సుయిజుపై 22–20, 21–10తో విజయం సాధించింది. అశ్మితా చాలిహా ఆతిథ్య దక్షిణ కొరియాకు చెందిన కిమ్ మిన్ జీపై 21–17, 21–6తో సునాయాసంగా గెలిచి క్వార్టర్స్‌కు చేరింది. తదుపరి మ్యాచ్‌లో టాప్‌సీడ్ హినా అకేచి (జపాన్)తో తలపడనుంది.






## ఫైనల్‌కు ఆశిష్, ధరణీధరన్

- డిస్కస్ త్రోలో అమనత్ కాంబోజ్ కూడా..
- ప్రపంచ అండర్–20లో సత్తా చాటిన భారత అథ్లెట్లు
- 800 మీటర్లలో సెమీస్‌లోకి వెంకట్రామ్.. మిక్స్‌డ్ రిలేలో నిరాశ

**యూజీన్:** ప్రపంచ అండర్–20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్లు సత్తా చాటారు. పురుషుల జావెలిన్ త్రోలో ఆశిష్ యాదవ్, టీ. ధరణీధరన్, మహిళల డిస్కస్ త్రోలో అమనత్ కాంబోజ్ ఫైనల్స్‌కు అర్హత సాధించి పతకాలపై భారత్ ఆశలను సజీవంగా ఉంచారు. అదే సమయంలో పురుషుల 800 మీటర్ల పరుగులో మొగలి వెంకట్రామ్ సెమీఫైనల్‌కు చేరి మరో శుభవార్త అందించాడు. జావెలిన్ త్రో అర్హత పోటీల్లో ఆశిష్ యాదవ్ అద్భుత ప్రదర్శనతో 69.87 మీటర్ల దూరం విసిరి తన గ్రూప్‌లో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. మొత్తం అర్హత పోటీల్లో దక్షిణాఫ్రికాకు చెందిన జాన్–హెండ్రిక్ హేమాన్స్ (76.02 మీటర్లు) తర్వాత రెండో స్థానంలో నిలిచాడు. మరో భారత అథ్లెట్ టీ. ధరణీధరన్ 68.07 మీటర్ల త్రోతో మొత్తం 12వ స్థానంలో నిలిచి చివరి అర్హత స్థానాన్ని సొంతం చేసుకుంటూ ఫైనల్‌కు చేరాడు. మహిళల డిస్కస్ త్రోలో అమనత్ కాంబోజ్ తన సీజన్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. ఆమె 52.58 మీటర్ల దూరం విసిరి ఫైనల్‌లో చోటు సంపాదించింది. ఈ ఈవెంట్‌లో చైనాకు చెందిన సూ యిక్సిన్ 58.06 మీటర్ల త్రోతో అగ్రస్థానంలో నిలిచింది.

### తొలి రౌండ్‌లోనే ఆనంద్ ఔట్

పురుషుల 800 మీటర్ల హీట్స్‌లో మొగలి వెంకట్రామ్ తన హీట్‌లో మూడో స్థానంలో నిలిచి సెమీఫైనల్‌కు అర్హత సాధించాడు. అయితే మరో భారత అథ్లెట్ ఉవిన్ ఆనంద్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. మరోవైపు 4×400 మీటర్ల మిక్స్‌డ్ రిలేలో భారత జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేక తొలి రౌండ్‌లోనే పోటీ నుంచి నిష్క్రమించింది.




## బకాయిల కోసం ఫోన్లు బ్లాక్ చేయొద్దు

- బ్యాంకులకు ఆర్‌బీఐ ఆదేశాలు
- 2027 జనవరి 1 నుంచి అమల్లోకి కొత్త మార్గదర్శకాలు
- వ్యక్తిగత, కారు, గృహ రుణాల వసూళ్లలో టెక్నాలజీ దుర్వినియోగానికి చెక్

**ముంబై:** వ్యక్తిగత, కారు, గృహ రుణాల బకాయిల వసూళ్ల కోసం రుణగ్రహీతల మొబైల్ ఫోన్లు, ట్యాబ్లెట్లు, ల్యాప్‌టాప్‌లను నిలిపివేయడం లేదా వాటి పనితీరును పరిమితం చేయరాదని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) బ్యాంకులను ఆదేశించింది. అయితే, ఆయా పరికరాల కొనుగోలుకే రుణం మంజూరు చేసిన సందర్భాల్లో మాత్రమే నిర్దిష్ట నిబంధనల మేరకు పరిమిత ఆంక్షలు విధించవచ్చని స్పష్టం చేసింది. రుణాల వసూళ్లలో బ్యాంకులు, రికవరీ ఏజెన్సీలు అనుసరించాల్సిన ప్రవర్తనా నియమావళిపై సవరించిన మార్గదర్శకాలను ఆర్‌బీఐ గురువారం విడుదల చేసింది. ఈ నిబంధనలు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. మొబైల్ ఫోన్, ట్యాబ్లెట్ లేదా ల్యాప్‌టాప్ కొనుగోలుకు బ్యాంకు రుణం ఇచ్చిన సందర్భాల్లో మాత్రమే బకాయిలు చెల్లించకపోతే పరికరం పనితీరుపై పరిమితులు విధించవచ్చని పేర్కొంది. అయితే, ఒకేసారి పూర్తిగా పరికరాన్ని నిలిపివేయకుండా దశలవారీ విధానాన్ని అనుసరించాలని సూచించింది. అలాగే ఇన్‌కమింగ్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు, అత్యవసర ఎస్ఓఎస్ వంటి కీలక సేవలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయరాదని స్పష్టం చేసింది. రుణ వసూళ్ల పేరుతో కొందరు బ్యాంకులు, రికవరీ ఏజెన్సీలు సోషల్ మీడియా ద్వారా వేధింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఈ మార్గదర్శకాలను రూపొందించినట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఈ ఏడాది మేలో విడుదల చేసిన ముసాయిదాపై వచ్చిన అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం తుది నిబంధనలను ప్రకటించింది.

### పరిమితం చేసే టెక్నాలజీ సురక్షితం

పరికరాల పనితీరును పరిమితం చేసే టెక్నాలజీ సురక్షితమైనది, నిబంధనలకు అనుగుణమైనది, పరీక్షించినదిగా ఉండాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.




ఇందుకోసం సంబంధిత పరికరం తయారీ సంస్థ లేదా ఆపరేటింగ్ సిస్టమ్ ప్లాట్‌ఫారమ్ నుంచి ధ్రువీకరణ పొందడం బ్యాంకులు, సేవలందించే సంస్థలకు తప్పనిసరి చేసింది. అదేవిధంగా, రుణ వసూళ్ల ప్రక్రియలో రుణగ్రహీతలు, గ్యారంటీదారుల వ్యక్తిగత సమాచారాన్ని అవసరమైన మేరకే ఉద్యోగులు, రికవరీ ఏజెన్సీలతో పంచుకోవాలని, వారి గోప్యతకు ఎలాంటి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌బీఐ ఆదేశించింది.

## మార్కెట్ మోసాలపై సెబీ ఉక్కుపాదం

- 2025–26లో 402 కేసుల దర్యాప్తు.. 338 విచారణలు పూర్తి
- ఇన్‌సైడర్ ట్రేడింగ్, ఫ్రంట్‌రన్నింగ్, ఆర్థిక అక్రమాలపై ప్రత్యేక నిఘా




**న్యూఢిల్లీ:** మూలధన మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) 2025–26 ఆర్థిక సంవత్సరంలో సెక్యూరిటీల చట్టాల ఉల్లంఘనలకు సంబంధించిన 402 కేసులను దర్యాప్తు కోసం స్వీకరించి, వాటిలో 338 కేసుల విచారణను పూర్తి చేసింది. ఈ వివరాలను సెబీ తన తాజా వార్షిక నివేదికలో వెల్లడించింది. మార్కెట్‌లో మోసపూరిత, అక్రమ ట్రేడింగ్‌పై సెబీ ప్రత్యేక నిఘా కొనసాగించింది. ప్రైస్ అండ్ వాల్యూమ్ మానిప్యులేషన్‌కు సంబంధించిన 72 కేసులు, ఫ్రంట్‌రన్నింగ్‌కు సంబంధించిన 49 కేసులు, ఇన్‌సైడర్ ట్రేడింగ్, టేకోవర్ నిబంధనల ఉల్లంఘనలు తదితర అంశాలకు సంబంధించిన 224 కేసులను దర్యాప్తుకు తీసుకుంది. వీటిలో అత్యధిక కేసుల విచారణను పూర్తిచేసినట్లు నివేదిక పేర్కొంది. కంపెనీల ఆర్థిక నివేదికల్లో అక్రమాలకు సంబంధించిన 57 కేసుల్లో 40 కేసుల విచారణను కూడా ముగించింది. మార్కెట్ పర్యవేక్షణ, స్టాక్ ఎక్స్ఛేంజీల నివేదికలు, ఫిర్యాదులు, మీడియా కథనాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. అవసరమైన సందర్భాల్లో ట్రేడింగ్ వివరాలు, బ్యాంకు లావాదేవీలు, డిపాజిటరీ సమాచారం, కేవైసీ రికార్డులు, షేర్‌హోల్డింగ్ వివరాలు, కాల్ డేటా రికార్డులను కూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. మార్కెట్ మధ్యవర్తులపై తనిఖీలను కూడా సెబీ మరింత కట్టుదిట్టం చేసింది. 2025–26లో సెబీ ఆధ్వర్యంలో 106 స్టాక్ బ్రోకర్లపై 179 తనిఖీలు నిర్వహించగా, స్టాక్ ఎక్స్ఛేంజీలు మరో 822 బ్రోకర్లకు సంబంధించిన 973 తనిఖీలు చేపట్టినట్లు వార్షిక నివేదికలో పేర్కొంది.

## 23% పెరిగిన ఎల్ఐసీ నికర లాభం

- తొలి త్రైమాసికంలో రూ.13,492 కోట్ల లాభం
- ప్రీమియం ఆదాయం, కొత్త వ్యాపార విలువలోనూ గణనీయ వృద్ధి




**న్యూఢిల్లీ:** దేశంలోని అతిపెద్ద జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ 2026–27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) రూ.13,492 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.10,987 కోట్లతో పోలిస్తే లాభం 23 శాతం పెరిగింది. తొలి త్రైమాసికంలో సంస్థ మొత్తం ప్రీమియం ఆదాయం రూ.1,19,200 కోట్ల నుంచి రూ.1,27,250 కోట్లకు పెరిగింది. మొత్తం ఆదాయం రూ.2,22,864 కోట్ల నుంచి రూ.2,37,848 కోట్లకు చేరింది. కొత్త వ్యాపార విలువ (వీఎన్‌బీ) 61 శాతానికి పైగా పెరగగా, వీఎన్‌బీ మార్జిన్ 22.90 శాతానికి చేరిందని ఎల్ఐసీ సీఈవో, ఎండీ ఆర్. దొరైస్వామి తెలిపారు. ఉత్పత్తుల వైవిధ్యీకరణ, పంపిణీ వ్యూహాలే ఈ వృద్ధికి కారణమన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా 6.5 శాతం అదనపు వాటాను విక్రయించగా, దీనికి మార్కెట్ నుంచి మంచి స్పందన లభించిందని తెలిపారు. అయితే సెబీ నిర్దేశించిన కనీస ప్రజా వాటా నిబంధనల మేరకు ఎల్ఐసీకి 2032 వరకు గడువు ఉన్నందున, వచ్చే 18–24 నెలల్లో ప్రభుత్వం మరోసారి వాటా విక్రయించే అవకాశం లేదని వెల్లడించారు. 10 శాతం పబ్లిక్ ఫ్లోట్ లక్ష్యాన్ని సంస్థ ఇప్పటికే చేరుకుందని చెప్పారు. మొదటి సంవత్సరం, రెన్యువల్, సింగిల్ ప్రీమియం ఆదాయాలు కూడా పెరిగాయి. సంస్థ నిర్వహణలోని ఆస్తుల (ఏయూఎం) విలువ రూ.59.39 లక్షల కోట్లకు చేరగా, సాల్వెన్సీ రేషియో 2.42కు మెరుగుపడింది. వ్యక్తిగత విభాగంలో విక్రయించిన పాలసీలు 2.06 శాతం పెరిగాయి. భవిష్యత్తులో ఫిన్‌టెక్ సంస్థల్లో వ్యూహాత్మక పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నామని, కొత్త నియంత్రణ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని దొరైస్వామి తెలిపారు.

## చిన్నింటి కలకు పీఎన్‌బీ హౌసింగ్ అండ

- మైక్రో హౌసింగ్ రుణాల్లో రూ.100 కోట్ల పోర్ట్‌ఫోలియో లక్ష్యం
- తక్కువ ఆదాయ వర్గాలపై ప్రత్యేక దృష్టి




**ముంబై:** సరసమైన గృహాల విభాగంలో తన కార్యకలాపాలను విస్తరించేందుకు పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ మైక్రో హౌసింగ్ రుణాలపై ప్రత్యేక దృష్టి సారించింది. తాజాగా ప్రారంభించిన ఈ విభాగంలో 2026–27 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.100 కోట్ల ఆస్తుల నిర్వహణ (ఏయూఎం) సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అజయ్‌కుమార్ శుక్లా తెలిపారు. మైక్రో హౌసింగ్ రుణ ఉత్పత్తిని ఇప్పటికే మార్కెట్లో ప్రవేశపెట్టామని, విధానాల రూపకల్పన, ఉద్యోగుల శిక్షణ పూర్తికావడంతో ఇక రుణాల పంపిణీ వేగవంతం కానుందని చెప్పారు. తక్కువ ఆదాయ వర్గాలకు రుణాలు అందించినప్పటికీ రుణాల పరిశీలన, ఆస్తుల విలువ నిర్ధారణ, న్యాయపరమైన తనిఖీలు, అండర్‌రైటింగ్ ప్రమాణాల్లో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ప్రస్తుతం సంస్థ పరపతి (లెవరేజ్) 3.7–3.8 రెట్లు ఉండగా, వచ్చే మూడేళ్లలో దాన్ని దాదాపు 6 రెట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జూన్ 2026 నాటికి సంస్థ మూలధన సమృద్ధి నిష్పత్తి (సీఆర్ఏఆర్) 28.26 శాతంగా నమోదైందన్నారు. నిర్మాణ రంగ రుణాల మంజూరును కూడా తిరిగి ప్రారంభించినట్లు వెల్లడించారు.

## రిలయన్స్ జోష్.. దూసుకెళ్లిన సెన్సెక్స్

- 374 పాయింట్లు ఎగబాకిన సూచీలు.. స్వల్ప లాభంతో ముగిసిన నిఫ్టీ
- ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ కొనుగోళ్లతో మార్కెట్‌కు ఊతం
- ముడి చమురు ధరల తగ్గుదల, ఆర్‌బీఐ నిర్ణయాలతో పెట్టుబడిదారుల్లో ఉత్సాహం

**ముంబై:** హెవీవెయిట్ షేర్లలో రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొనుగోళ్లు జోరందుకోవడంతో దేశీయ ఈక్విటీ మార్కెట్లు గురువారం మిశ్రమ ధోరణిలో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 373.76 పాయింట్లు (0.48 శాతం) లాభపడి 78,954.76 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 11.35 పాయింట్లు (0.05 శాతం) పెరిగి 24,636 వద్ద స్థిరపడింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 3.43 శాతం ఎగబాకి సెన్సెక్స్‌లో అత్యధిక లాభదాయక షేరుగా నిలిచింది.

ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీ ఐ, భారత్ ఎలక్ట్రానిక్స్, టైటాన్, ఈటర్నల్ షేర్లు కూడా లాభపడ్డాయి. మరోవైపు పవర్‌గ్రిడ్, టీసీఎస్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టాల్లో ముగిశాయి. జూన్ త్రైమాసిక ఫలితాల ప్రభావంతో పవర్‌గ్రిడ్ షేరు 3.99 శాతం పడిపోయింది. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌లో క్లోజింగ్ ఆక్షన్ సెషన్ విధానం అమలుతో సెన్సెక్స్, నిఫ్టీ ముగింపు స్థాయిల్లో వ్యత్యాసం కనిపిస్తోందని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. రంగాల వారీగా పీఎస్‌యూ బ్యాంక్ సూచీ 2.13 శాతం లాభపడగా, క్యాపిటల్ గూడ్స్, ఎనర్జీ, బ్యాంకెక్స్, ఇండస్ట్రియల్స్ సూచీలు కూడా పుంజుకున్నాయి. రియాల్టీ, సర్వీసెస్, మెటల్, ఇన్సూరెన్స్, పవర్ సూచీలు మాత్రం నష్టాల్లో ముగిశాయి. ముడి చమురు ధరలు తగ్గడం, పశ్చిమాసియా ఉద్రిక్తతలు సడలే అవకాశాలు, రెపో రేటును యథాతథంగా కొనసాగిస్తూ ఆర్‌బీఐ వృద్ధి అంచనాలను మెరుగుపరచడం మార్కెట్‌కు మద్దతుగా నిలిచాయని నిపుణులు పేర్కొన్నారు.




కాగా, బుధవారం విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.943.42 కోట్ల విలువైన షేర్లను విక్రయించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్ గణాంకాలు వెల్లడించాయి. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, యూరప్ మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి.

# సందీప్ కిషన్ సరికొత్త చిత్రం కరికాల



యంగ్ హీరో సందీప్ కిషన్ తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. విభిన్న కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన, ఇప్పుడు పీరియాడిక్ యాక్షన్ జానర్‌లోకి అడుగుపెడుతున్నారు. తాజాగా 'కరికాల' అనే భారీ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారి సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇటీవలి కాలంలో పీరియాడిక్ కథలు, రాజుల చరిత్ర, యుద్ధ నేపథ్యంతో రూపొందుతున్న సినిమాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అదే తరహాలో ఇప్పుడు సందీప్ కిషన్ డా ఓ భారీ పీరియాడిక్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'శంబాల' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ శక్తివంతమైన యోధుడి పాత్రలో కనిపిస్తున్నారు. చేతిలో కత్తి పట్టుకుని గుర్రంపై యుద్ధానికి దూసుకెళ్తున్న ఆయన లుక్ ఆకట్టుకుంటోంది. పోస్టర్‌లో ఆయన పక్కనే ఓ సింహం కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యుద్ధభూమి వాతావరణం, భారీ విజువల్స్, పవర్‌ఫుల్ లుక్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. పోస్టర్‌ను బట్టి చూస్తే, ఇది వలం యాక్షన్ సినిమా మాత్రమే కాకుండా చారిత్రక నేపథ్యంతో డిన ఎమోషనల్ సాగా డా కావచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను రెండు భాగాలుగా తెరకెక్కించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. విడుదల తేదీలను డా అధికారికంగా వెల్లడించారు. 'కరికాల చాప్టర్ 1' : 2027 జూలై 2, 'కరికాల చాప్టర్ 2' : 2027 అక్టోబర్ 28 అంటే వలం నాలుగు నెలల వ్యవధిలోనే రెండు భాగాలను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేయడం విశేషం. ఇప్పటివరకు సందీప్ కిషన్ ఎక్కువగా యాక్షన్, థ్రిల్లర్, కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాల్లో కనిపించారు. అయితే 'కరికాల' తో తొలిసారి భారీ పీరియాడిక్ యాక్షన్ కథలో నటిస్తున్నారు. అయితే సినిమా కథ, ఇతర నటీనటులు, సాంతిక బృందాని కి సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించే అవకాశం ఉంది. ప్రస్తుతం 'సిగ్మా' విడుదల కోసం సందీప్ కిషన్ ఎదురు చూస్తున్నారు. విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ ఈ సినిమాతో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. జులై 31న 'సిగ్మా' విడుదల కావాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల ఇది వాయిదా పడింది.



## భన్సాలీ భారీ చిత్రంలో
# ధనుష్‌తో కరీనా జోడీ?

బాలీవుడ్ స్టార్ నిర్మాత, దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ నిర్మాణంలో మరో ప్రతిష్ఠాత్మక చిత్రం తెరకెక్కనున్నట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ భారీ మైథాలాజికల్ జంగిల్ అడ్వెంచర్‌లో తమిళ స్టార్ హీరో ధనుష్, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఖాన్ ప్రధాన పాత్రల్లో నటించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. తమిళ దర్శకుడు పి.ఎస్. మిత్రన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారని సమాచారం. దట్టమైన అడవి నేపథ్యంలో సాగే ఈ కథలో ఓ ఏనుగు కీలక పాత్ర పోషించనుండగా, పురాణ గాథలకు సాహస కథనాన్ని జోడించి విభిన్నమైన కథాంశంతో సినిమాను రూపొందించనున్నట్లు తెలుస్తోంది. విజువల్‌గా అత్యున్నత ప్రమాణాలతో, భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. 2027 ప్రారంభంలో ఈ సినిమా షూటింగ్‌ను ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు కరీనా కపూర్ ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తే, 'దేవదాస్' చిత్రం సమయంలో ప్రారంభమైన సంజయ్ లీలా భన్సాలీతో ఆమె అనుబంధానికి దాదాపు రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ కొనసాగింపు లభించినట్లవుతుంది. ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే బాలీవుడ్‌లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రస్తుతం భన్సాలీ తన ప్రతిష్ఠాత్మక చిత్రం 'లవ్ అండ్ వార్' నిర్మాణ పనులతో బిజీగా ఉండగా, ఆ సినిమా పూర్తయిన అనంతరం ఈ మైథాలాజికల్ అడ్వెంచర్‌ను అధికారికంగా పట్టాలెక్కించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ధనుష్–కరీనా కాంబినేషన్, భన్సాలీ నిర్మాణం, పి.ఎస్. మిత్రన్ దర్శకత్వం కలిసి రావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

# ప్యారడైజ్‌తో పోటీ పడనున్న డోరతి మూవీ

న్యాచురల్ స్టార్ నాని హీరోగా, కయాదు లోహర్ హీరోయిన్‌గా మాస్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్'. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా వస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాను సెప్టెంబర్ 25న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే, సరిగ్గా అదే తేదీన నానితో పోటీ పడేందుకు ఆయన 'దసరా' సహనటి కీర్తి సురేష్ సిద్ధమవుతుండటం ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ కోలీవుడ్ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కిస్తున్న 'డోరతి' చిత్రంలో కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. సంగీత మాంత్రికుడు ఇళయరాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఇప్పటి ప్రకటించింది. ప్రస్తుతానికి ఈ రిలీజ్ డేట్‌ను తమిళ వెర్షన్ కోసం లాక్ చేసినప్పటికీ, తెలుగులోనూ ఇదే తేదీకి వస్తే బాక్సాఫీస్ వద్ద నాని సినిమాతో కీర్తి సురేష్ నేరుగా పోటీ పడాల్సి వస్తుంది. మంచి స్నేహితులుగా ఉన్న నాని, కీర్తి సురేష్‌ల చిత్రాలు ఒ తేదీన బరిలో నిలుస్తుండటంతో ఈ బాక్సాఫీస్ క్లాష్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చివరికి ఈ సినిమాల విడుదల తేదీల్లో మార్పులు ఉంటాయా లేదా అనేదానిపై త్వరలోనే క్లారిటీ రానుంది.

# మిస్సింగ్ మేఘన.. ఫస్ట్ లుక్ రిలీజ్




రావ్ కార్తీక్ హీరోగా, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ చిత్రం 'మిస్సింగ్ మేఘన'. ఫస్ట్ కాపీ మూవీస్ మరియు డి అండ్ కో బ్యానర్లపై పంచుమర్తి నరేష్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి వాచస్పతి దర్శకత్వం వహిస్తున్నారు. గోపరాజు రమణ, వెంప కాశి, కౌశిక్, మహిపాల్, రుచిత, నళిని, శ్రీనివాస్, అజీవ్, పండు తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ రివీలింగ్ పోస్టర్ లాంచ్ కార్యక్రమం టాలీవుడ్ ప్రముఖ టెక్నీషియన్లు, సినీ ప్రముఖుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ ఈ చిత్ర పోస్టర్‌ను తన చేతుల మీదుగా విడుదల చేసి సినిమా యూనిట్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బెక్కం వేణుగోపాల్‌తో పాటు చిత్ర బృందమంతా ఉత్సాహంగా పాల్గొంది. ఈ సందర్భంగా వి.వి. వినాయక్ మాట్లాడుతూ, బెక్కం వేణుగోపాల్, శ్రీనివాస్ ల సహకారంతో దర్శకుడు వాచస్పతి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్నారని తెలిపారు. ఈ సినిమాతో హీరో రావ్ కార్తీక్, దర్శకుడు వాచస్పతిలకు మంచి పేరు రావాలని, అలాగే సంగీతంతో పాటు పాటలు డా అందించే ఆల్ రౌండర్ ధృవన్‌కు ఈ చిత్రం ద్వారా మంచి గుర్తింపు దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ చిత్ర యూనిట్ మొత్తానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. దర్శకుడు వాచస్పతి మాట్లాడుతూ, వి.వి. వినాయక్ గారిది గో÷–డలెన్ హ్యాండ్ అని, ఆయన చేతుల మీదుగా తమ సినిమా పోస్టర్ లాంచ్ కావడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మీడియా సహకారంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ చిత్రం ఒక చక్కటి సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ఉంటుందని, ప్రేక్షకులను అలరించే అన్ని కమర్షియల్ హంగులు ఇందులో ఉన్నాయని తెలిపారు. అతి త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. హీరో రావ్ కార్తీక్ మాట్లాడుతూ, తమకు ఈ చిత్రంలో అవకాశం కల్పించిన దర్శకుడు వాచస్పతికి, నిర్మాత నరేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమా ఖచ్చితంగా ప్రేక్షకులందరినీ అలరిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధృవన్ మాట్లాడుతూ, లెజెండ్రీ డైరెక్టర్ వి.వి. వినాయక్ చేతుల మీదుగా పోస్టర్ విడుదల కావడం తన కెరీర్‌లో మరువలేని క్షణమని, ఒక మంచి మ్యూజిషియన్‌కు కావాల్సిన అన్ని రకాల ఎమోషన్స్ ఈ సినిమాలో ఉన్నాయని వెల్లడించారు. ఈ చిత్రానికి శావ్ కె. నాయుడు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తుండగా, వనరాజ్ కథ, స్క్రీన్‌ప్లే అందించారు.

## విడుదలకు సిద్ధం అవుతున్న
# కొరియన్ కనకరాజు



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటించిన ఇండో–కొరియన్ హారర్ కామెడీ 'కొరియన్ కనకరాజు' విడుదలకు సిద్ధమైంది. దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ప్రముఖ కమెడియన్ సత్య కీలక పాత్ర పోషించారు. ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ఇప్పటి సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో సినిమా చూసిన వారి ఒపీనియన్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా కామెడీ, వరుణ్ తేజ్ నటన, థమన్ సంగీతం సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయని టాక్ వినిపిస్తోంది. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'ఎక్స్‌ప్రెస్ రాజా' వంటి విజయవంతమైన కామెడీ చిత్రాలను తెరకెక్కించిన మేర్లపాక గాంధీ, మరోసారి తన మార్క్ కామెడీని ఈ చిత్రంలో చూపించినట్లు సమాచారం. సినిమా తొలి భాగం నుంచి రెండో భాగం వరకు పలు కామెడీ సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని సెన్సార్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఇంటర్వెల్ ముందు, తర్వాత వచ్చే ఎపిసోడ్లు బాగా వర్కవుట్ అయ్యాయని అంటున్నారు. అలాగే వరుణ్ తేజ్, సత్య మధ్య వచ్చే కామెడీ ట్రాక్‌తో పాటు బుల్లిరాజు పాత్ర చుట్టూ తిరిగే సన్నివేశాలు డా మంచి వినోదాన్ని అందిస్తాయని సమాచారం. సినిమాలో వరుణ్ తేజ్ రెండు విభిన్న కోణాలు ఉన్న పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. అనంతపురం జిల్లా పెనుగొండకు చెందిన సాధారణ యువకుడు కనకరాజు పాత్రలో ఒకవైపు కనిపిస్తే, మరోవైపు కొరియన్ గ్యాంగ్‌స్టర్ ఆత్మ ఆవహించిన తర్వాత పూర్తిగా భిన్నమైన వ్యక్తిత్వంతో కనిపించనున్నారని టాక్.ఈ రెండు పాత్రల మధ్య బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, స్టైల్ పరంగా వరుణ్ తేజ్ మంచి వేరియేషన్ చూపించారని సినిమా చూసిన వారు చెబుతున్నారు. కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే వరుణ్ తేజ్ ఈసారి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లో డా తన నటనతో ఆకట్టుకున్నారని సమాచారం.

సినిమా కథ ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో రూపొందినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని కియా కంపెనీలో ఉద్యోగం కోసం కొరియా నుంచి వచ్చిన యువతి పాత్రలో రితికా నాయక్ కనిపించనుంది. ఆమెను ప్రేమించే కనకరాజు జీవితంలో అనుకోని మలుపు తిరుగుతుంది.కొరియా నుంచి వచ్చిన ఓ బాటిల్‌లో బంధించబడిన గ్యాంగ్‌స్టర్ ఆత్మ బయటకు వచ్చి కనకరాజును ఆవహిస్తుంది. ఆ తర్వాత కనకరాజు జీవితం ఎలా మారింది? ఆ ఆత్మ కొరియాతో ఉన్న సంబంధం ఏమిటి? చివరకు కథ ఎలాంటి మలుపు తిరిగింది? అనే అంశాల చుట్టూనే సినిమా సాగుతుందని తెలుస్తోంది. సినిమాకు సంగీత దర్శకుడు ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు కథకు మరింత బలం చేర్చాయని సమాచారం. కామెడీ తర్వాత ఎక్కువ ప్రశంసలు సంగీతాని వస్తాయని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.

## హీరోయిన్ ఛాన్స్‌లకు
# నో చెప్పిన 'చర్మిల'



టాలీవుడ్‌లో ఇటీవల జరుగుతున్న సినిమా ఈవెంట్లు, ఆడియో లాంచ్‌లు, ప్రీ రిలీజ్ వేడుకల్లో తనదైన శైలిలో హోస్టింగ్ చేస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యాంకర్ చర్మిల నల్లూరి ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచింది. సమయస్ఫూర్తితో మాటల్ని అలవోకగా మలచడం, వేదికపై ఎనర్జీతో కార్యక్రమాన్ని ముందుకు నడిపించడం, అతిథులతో చక్కటి సంభాషణలు కొనసాగించడం వంటి ప్రత్యేకతలతో ఆమె చాలా తక్కువ సమయంలోనే సినీ అభిమానులకు దగ్గరైంది. ఈ క్రమంలో చర్మిలలోని ప్రతిభను గుర్తించిన చిత్రసీమకు చెందిన పలువురు ప్రముఖులు ఆమెకు వెండితెరపై హీరోయిన్‌గా నటించే అవకాశాలను కూడా ఆఫర్ చేశారు. మెగా నిర్మాత అల్లు అరవింద్‌తో పాటు సీనియర్ నిర్మాత, దర్శకుడు ఎమ్.ఎస్. రాజు సైతం తమ చిత్రాల్లో హీరోయిన్‌గా నటించాలంటూ చర్మిలను సంప్రదించారని, ఆ సమయంలో ఈ విషయం సినీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారిందని తెలుస్తోంది. అయితే వెండితెరపై కథానాయికగా మెరవాలనే కలతో ఎంతోమంది ఎదురుచూస్తున్న సమయంలో, తనను వెతుక్కుంటూ వచ్చిన ఈ అవకాశాలను చర్మిల మాత్రం ఎంతో మర్యాదపూర్వకంగా తిరస్కరించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, ఆ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను వెల్లడించింది. తనకు నటనపై ఎప్పుడూ ఆసక్తి లేదని, నటిగా కెరీర్‌ను కొనసాగించాలనే ఆలోచన కూడా ఎప్పుడూ రాలేదని స్పష్టం చేసింది. అంతేకాకుండా తాను సినిమాల్లో నటించడం తన తల్లిదండ్రులకు కూడా ఇష్టం లేదని, వారి అభిప్రాయాన్ని గౌరవించడం తన బాధ్యతగా భావించానని చెప్పింది. తల్లిదండ్రుల మాటను కాదని సినిమాల్లోకి వెళ్లే ప్రసక్తే లేదని తేల్చిచెప్పిన చర్మిల, యాంకరింగ్ రంగంలోనే మరింత ఎదిగి తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకోవడమే తన ఏకైక లక్ష్యమని ఆత్మవిశ్వాసంతో వెల్లడించింది. కెరీర్‌లో పెద్ద అవకాశాలు వచ్చినప్పటికీ తన లక్ష్యాన్ని మార్చుకోకుండా యాంకరింగ్‌కే కట్టుబడి ఉండడాన్ని నెటిజన్లు, అభిమానులు ప్రశంసిస్తున్నారు. గ్లామర్ రంగంలో ఉన్నప్పటికీ తన అభిరుచులు, ప్రాధాన్యతలు, లక్ష్యాల విషయంలో స్పష్టమైన దృక్పథంతో ముందుకు సాగడం నిజంగా అభినందనీయమని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఆదిపురుష్‌తో రామాయణను పోల్చొద్దు

బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'. ఈ సినిమా ట్రైలర్ విడుదలైన నాటి నుంచి వార్తల్లో నిలుస్తోంది. గతంలో వచ్చిన 'ఆదిపురుష్'తో ఈ చిత్రాన్ని పోలుస్తూ కొందరు పోస్టులు పెడుతున్నారు. తాజాగా ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో 'ఆదిపురుష్' రచయిత మనోజ్ దీనిపై మాట్లాడారు. 'రామాయణ'లో రావణుడి పాత్ర పోషించిన యశ్‌పై ప్రశంసలు కురిపించారు. యశ్ చాలా మంచి నటుడు. అందులో ఎలాంటి సందేహం లేదు. మన భారతీయ ఇతిహాసాన్ని ప్రపంచ వేదికపైకి తీసుకెళ్లే ఏ సినిమాకైనా నా పూర్తి మద్దతు ఉంటుంది. 'రామాయణ' మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా. ఈ చిత్రాన్ని 'ఆదిపురుష్'తో పోల్చొద్దు. అది ప్రేక్షకుల అంచనాలను అందుకోలేపోయింది. ఆ సినిమా కోసం ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడ్డారు. అయితే, 'ఆదిపురుష్' సంగీతం మంచి ఆదరణ సొంతం చేసుకుంది. ఇప్పుడు రామాయణ మ్యూజిక్ కూడా హిట్ కావడం నాకు చాలా ఆనందంగా ఉంది' అని మనోజ్ తెలిపారు. రణ్‌బీర్ కపూర్ రాముడిగా కనిపించనున్న రామాయణ చిత్రం రెండు భాగాలుగా రానుంది. ఇప్పటి రెండో భాగం డా 50 శాతం షూటింగ్ పూర్తయినట్లు రణ్‌బీర్ తెలిపారు. రామాయణ లాంటి గొప్ప కథను 10 భాగాలు తీయొచ్చని రెండు భాగాల్లోనే నితీశ్ తివారీ అద్భుతంగా తెరకెక్కిస్తున్నారని ప్రశంసించారు. దీపావళికి ఈ సినిమా మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.